శనివారం
06-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 195
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ద.కొరియా దిశగా ఉ.కొరియా 'శతఘ్ని' దాడి

ప్యాంగ్యాంగ్: దక్షిణ కొరియా ద్వీపమైన యొన్పియోంగ్ దిశగా ఉత్తర కొరియా దాదాపు 200 శతఘ్ని గుండ్లు పేల్చింది. అవి దక్షిణ కొరియా భూభాగానికి చేరలేదు... మధ్యలోనే సముద్రంలోని బఫర్ జోన్‌లో పడిపోయాయి. దీనిపై దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్స్ స్పందిస్తూ ఉత్తర కొరియా చర్యలు శాంతి, సుస్థిరతకు ముప్పుగా మారాయన్నారు.

2010లో ఉత్తర కొరియా ఈ ద్వీపంపై జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోయారు. అమెరికాతో దోస్తీ కారణంగా దక్షిణ కొరియాతో సయోధ్యకు స్వస్తి పలుకుతున్నట్లు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

లోక్‌సభ ఎన్నికలపై
ఈసీ కసరత్తు

ఏడు నుంచి దక్షిణాది రాష్ట్రాల పర్యటన

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. అందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయడానికి సమాయత్తమవుతోంది. అందులో భాగంగా వచ్చేవారం నుంచి దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో ఈసీ పర్యటనలు చేపట్టనుంది. తొలి విడతగా దక్షిణాది రాష్ట్రాల్లో సమావేశాలు నిర్వహించనుంది. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కూడిన బృందం జనవరి 7 నుంచి రాష్ట్రాల్లో పర్యటించనుంది. జనవరి 7 నుంచి 10వ తేదీ మధ్య తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈసీ బృందం వెళ్లనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు దాదాపు అన్ని రాష్ట్రాల్లో పర్యటించి... లోక్‌సభ ఎన్నికల సన్నాహాలను పర్యవేక్షించారు. ఈసీ బృందం రాష్ట్రాల

- మిగతా 2 లో

ఆర్-5 జోన్ గతీ అంతే

- సుప్రీం విచారణ ఏప్రిల్‌కు వాయిదా
- నెరవేరని జగన్ కల
- భారతీ సిమెంట్స్ కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పుపై అభ్యంతరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని ప్రాంతంలో ఆర్-5 జోన్ వ్యవహారంలో జగన్ సర్కార్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇతర ప్రాంతాల్లో నివసించే సుమారు 55వేల మంది పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్లస్థలాలు ఇచ్చి తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో మరోసారి వైసీపీ జెండా ఎగురవేయాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆర్-5 జోన్ ఏర్పాటుపై దాఖలైన పిటిషన విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేస్తూ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలిచ్చింది. దీనిపై తక్షణమే జోక్యం చేసుకుని పిటిషన్లపై విచారణ జరపాలని ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరినప్పటికీ ధర్మాసనం ఒప్పుకోలేదు. నాన్ మిస్‌లేనియస్ డేలో ఈ వ్యవహారాన్ని విచారిస్తామని తేల్చిచెప్పింది. రాజధాని అమరావతికి సంబంధించిన ప్రధాన పిటిషన్ కూడా ఇదే ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉందని రైతుల తరపు సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్

- మిగతా 2 లో

వేడెక్కిన బెజవాడ రాజకీయం

- టీడీపీలో భగ్గుమన్న విభేదాలు
- విజయవాడ ఎంపీ టికెట్టు రగడ
- ఎంపీ కేశినేని నాని అసంతృప్తి
- మల్లాది విష్ణు, వెలంపల్లి అలక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, రాజకీయ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా నిలిచిన బెజవాడ రాజకీయం రసవత్తరంగా మారింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల జాబితా ప్రకటనకు కసరత్తు చేస్తున్నాయి. అధికార వైసీపీ ఇప్పటికే రెండు జాబితాలు విడుదల చేసి, మూడో జాబితాపై కసరత్తు చేస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారుస్తూ, కొందరికి టికెట్లు నిరాకరిస్తూ వైసీపీ జాబితాలు విడుదల చేయడం కలకలం రేపుతోంది. దీంతో వైసీపీలో ఇన్‌చార్జిలు దక్కని వారు, తమ స్థానాల్లో ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేలంతా అసంతృప్తి రాగం అందుకున్నారు. పార్టీ వీడనంటూనే అనుచరులతో సమాలోచనలు చేస్తున్నారు. కొత్తగా వచ్చిన ఇన్‌చార్జిలను కలుపుకుని ముందుకెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. వైసీపీకి పోటీగా టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు అభ్యర్థులను నిలిపేందుకు కసరత్తు ప్రారంభించింది. తాజాగా విజయవాడ సిటింగ్ ఎంపీ కేశినేని

- మిగతా 2 లో

మోదీ సెల్ఫీ పాయింట్ల
ఖర్చు ఎంత?

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ తన ప్రచారాన్ని ఉధృతం చేయడం కోసం అనేక చోట్ల సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయించారు. తన ప్రచారానికి రైల్వేలను, ఐఏఎస్., ఐపీఎస్. అధికారులనూ కడకు సైనికులనూ వినియోగిస్తున్నారు. ఈ మేరకు ఆదేశాలను కొద్ది రోజుల కిందట జారీ చేసిన విషయం విదితమే. ప్రభుత్వ పథకాలు, కడకు ప్రజలకు న్యాయంగా దక్క వలసిన ఎరువుల బస్తాలు, పెట్రోల్ బంకులలో కూడా

- మిగతా 2 లో

ఆసియా కుబేరుడిగా అదానీ

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ తిరిగి ఆసియా కుబేరుడిగా ఎదిగారు. అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలపై సెబీ విచారణను మినహాయించి ప్రత్యేకమైన దర్యాప్తులేమీ అవసరం లేదని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆయన సంపద గణనీయంగా పెరిగింది. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం... గౌతమ్ అదానీ సంపద ఒక్కరోజే 7.7 బిలియన్ డాలర్లు పెరిగి 97.6 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ఆయన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని అధిగమించి... ప్రపంచ సంపన్నుల జాబితాలో 12వ స్థానానికి చేరారు. 97 బిలియన్ డాలర్లతో అంబానీ 13వ స్థానంలో కొనసాగుతున్నారు. అదానీ గ్రూప్ నమోదిత సంస్థల స్టాక్ విలువ పెంచేందుకు అవకతవకలు జరిగాయని, అకౌంట్ మోసాలకు కూడా

- మిగతా 2 లో

జగన్‌నే బదిలీ చేద్దాం

వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

కనిగిరి సభలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సైకో జగన్‌కు ఒక అవకాశం ఇచ్చి తప్పు చేశామని పశ్చాత్తాపంలో రాష్ట్ర ప్రజలు ఉన్నారని అన్నారు. శుక్రవారం 'రా... కదిలి... రా' పేరుతో ఒంగోలు పార్లమెంటు పరిధిలోని కనిగిరిలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యేలను, ఎంపీలను బదిలీ చేసినంత మాత్రాన విజయం దక్కదని, ప్రజలే జగన్‌ను బదిలీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఒక ఊరిలో పనికిరాని చెత్తను మరో ఊరిలో వేస్తున్నారని, అయినా ఆ చెత్త ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఓటమి తప్పదన్నారు. ఆరు గ్యారంటీలతో తెలుగుదేశం పార్టీ ఎన్నికల సమరంలోకి దిగుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. ప్రతి ఆడబిడ్డకు

- మిగతా 2 లో

బీజేపీ నేత వ్యాఖ్యలు
అర్థరహితం

- బెదిరింపు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు తగవు
- ఇది తెలుగు జాతి ఆత్మగౌరవానికి పరీక్షా సమయం
- టీడీపీ నేతలు స్పందించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు: మాతో పొత్తు కావాలని కోరుకుంటున్న నేతలు మా అధిష్ఠానంతో మాట్లాడాలి... మాతో పొత్తు కావాలని పవన్‌కళ్యాణ్ చెప్పడం కాదు... టీడీపీతో కూడా చెప్పించాలి... యువగళం వేదిక మీద బీజేపీతో పొత్తుపై లోకేశ్‌తో పవన్ మాట్లాడించి ఉండాల్సింది... అంటూ బీజేపీ నేత సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆయన వ్యాఖ్యలు టీడీపీని బెదిరిస్తున్నారో...

- మిగతా 2 లో

తెలుగుభాషను బతికించాలి

అంతర్జాతీయ తెలుగు మహాసభలో వక్తల ఉద్ఘాటన

8లో

చరిత్రకారులకు ఇదే పెద్ద పండుగ

- నేటి నుంచి విశాఖలో ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ వార్షిక సభలు
- ఆచార్య కె.తిమ్మారెడ్డి వెల్లడి

3లో

నేటి పాలక ప్రభుత్వాల విధానాల వల్ల అంతరించిపోతున్న చరిత్రను రేపటి తరానికి తెలియజేసేలా శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సభలు విశాఖపట్నంలోని డా. బుల్లయ్య కళాశాలలో జరుగనున్నాయి.

ఇదీ లోకం!

మీరెందుకు సార్ ఏడుస్తారు, మిమ్మల్ని ఎన్నుకున్నందుకు మేము కదా భోరుమని ఏడవాలి!

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఏపీ హవా

- అత్యుత్తమ నగరాలుగా విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు వెల్లడి

8లో

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా విజయవాడ, విశాఖ, తిరుపతి నగరాలలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

రష్యా, ఉక్రెయిన్‌కు నేపాల్ వర్క్‌పర్మిట్ల నిలిపివేత

ఖాట్మండు: రష్యా సైన్యం తరపున పోరాడుతూ తమ పౌరులు ప్రాణాలు కోల్పోవడంతో రష్యా, ఉక్రెయిన్ వర్క్ పర్మిట్‌లను నిలిపివేసినట్లు నేపాల్ ప్రకటించింది. రష్యా సైన్యంలో చేరిన పది మంది నేపాలీలు... రష్యా-ఉక్రెయిన్ మధ్య పోరులో మృతి చెందారు. దీంతో రష్యా, ఉక్రెయిన్‌కు తమ పౌరులు ఎవ్వరూ వెళ్లేందుకు వీల్లేకుండా వర్క్ పర్మిట్‌ల జారీని నిలిపివేస్తూ నేపాల్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇది గంభీరమైన అంశమని, నేపాలీ యువత అక్రమంగా రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నేపాల్ విదేశీ ఉద్యోగాల శాఖ ఓ నోటీసులో పేర్కొన్నట్లు మై రిపబ్లికా వార్తాసంస్థ నివేదించింది. ప్రస్తుతం 150-200 మంది నేపాలీలు రష్యా సైన్యంలో ఉన్నట్లు రష్యాకు నేపాల్ రాయబారి మిలన్ రాజ్ తులాదార్ తెలిపారని ది ఖాట్మండు పోస్టు వెల్లడించింది. ఉక్రెయిన్ సైన్యంలోనూ తమ పౌరులు ఉన్నట్లు సమాచారం అందిందని గతేడాది డిసెంబరు 4న ప్రధాని పుష్ప కమల్ దహాల్ తెలిపారు. అయితే రష్యా, ఉక్రెయిన్ సైన్యంలో తమ వారు ఎంత మంది ఉన్నారన్న కచ్చితమైన డేటా నేపాల్ ప్రభుత్వం వద్ద లేదని సమాచారం. తమ పౌరులను స్వదేశానికి పంపించేయాలని రష్యా ప్రభుత్వాన్ని నేపాల్ విదేశాంగ శాఖ ఇటీవల కోరిన విషయం తెలిసిందే.

అమెరికా స్కూల్లో కాల్పులు

ఇద్దరు విద్యార్థుల మృతి

మరో ఐదుగురికి గాయాలు

పెర్రీ: అమెరికా మళ్లీ కాల్పులు కలకలం రేపాయి. అయోవా రాష్ట్రం, డాలస్ కౌంటీలోని పెర్రి నగరంలోని హైస్కూల్లో ఓ 17ఏళ్ల విద్యార్థి బీభత్సం సృష్టించాడు. ఆరవ తరగతి విద్యార్థిని కాల్చి చంపాడు. మరో ఐదుగురిని గాయపర్చాడు. శీతాకాల సెలవుల తర్వాత తరగతులు మొదలు కాగా అదే స్కూలు విద్యార్థి రెచ్చిపోయాడు. గాయపడిన వారిలో స్కూలు ప్రిన్సిపల్ డాన్ మార్‌బర్గర్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాల్పులు జరిపిన విద్యార్థిని డైలన్ బట్లర్ (17)గా గుర్తించామన్నారు. అతను తనను తాను కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తంచేశారు.

అయితే అతను కాల్పులు ఎందుకు జరిపాడో తెలియలేదు. బట్లర్ నిశ్శబ్దంగా ఉండేవాడని, చాలా ఏళ్లుగా వేధింపులకు గురవుతున్నాడని అతని ఇద్దరు స్నేహితులు, వారి తల్లి తెలిపారు. బట్లర్ వద్ద పంప్-యాక్షన్ షాట్‌గన్, స్మాల్ క్యాలిబర్ హ్యాండ్‌గన్ ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఈ దాడి వెనుక ఉద్దేశాన్ని కనిపెట్టేందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్టులనూ పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కాల్పుల ఘటనకు ముందు స్కూల్లోని టాయిలెట్‌లో ఉన్న తన ఫొటోను టిక్‌టాక్‌లో బట్లర్ పెట్టాడని, దానికి స్ట్రే బుల్లెట్ పాటతోపాటు 'నౌ వి వెయిట్' అనే క్యాప్షన్ జోడించినట్లు తెలిపారు. బట్లర్ ఇద్దరు సోదరీమణులు, వారి తల్లి మాట్లాడుతూ చిన్నతనం నుంచి బట్లన్‌ను అంతా ఏడ్పించేవారని చెప్పారు. అందువల్లే ఈ దారుణానికి పాల్పడివుంటాడని చెప్పారు.

92కు పెరిగిన జపాన్ భూకంప మృతులు

242 మంది గల్లంతు

టోక్యో: జపాన్‌లో సంభవించిన భారీ భూకంపంలో చనిపోయిన వారి సంఖ్య 92కు పెరిగింది. మరో 242 మంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. కీలకమైన 72 గంటల సమయం గురువారం సాయంత్రంతో ముగిసే నాటికి మృతుల సంఖ్య 92కు చేరిందన్నారు. 4,600 మంది గాలింపు చర్యల్లో నిమగ్నమైనట్లు చెప్పారు. సుజు, వాజిమా నగరాల్లో శిథిలాల కిందే చిక్కుకుపోయి వారి కోసం గాలిస్తున్నారన్నారు. వేల కుటుంబాలకు నీరు, విద్యుత్ అందడటంలేదు. ఈ నగరాలకు వెళ్లే రోడ్లు దెబ్బతినడంతో చాలా మంది నిస్సహాయులుగా ఉండిపోతున్నారు. ఈ విపత్తుపై అధికారులతో శుక్రవారం ప్రధాని కిషిదా సమావేశమయ్యారు. చేతనైనన్ని ప్రాణాలను కాపాడతామని, చివరి వరకు యత్నిస్తామన్నారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని అధికారులకు సూచించారు. వాజిమా నగరంలోని సెన్మడియా పాకెట్ పార్క్‌లో దాదాపు 60 మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. వీరిలో విదేశీయులు కూడా ఉన్నారు. సుజు నగరంలో రూట్-52 మార్గం మొత్తం చెట్లు కూలిపోయి ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆర్టోమచి అనే ప్రాంతాన్ని జపాన్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ సిబ్బంది చేరుకొన్నారు. అక్కడ రెండు షెల్టర్లలో 150 మంది ఉన్నట్లు గుర్తించారు.

బీజేపీ నేత వ్యాఖ్యలు అర్థరహితం

(మొదటిపేజీ తరువాయి)

బ్లాక్‌మెయిల్ చేస్తున్నారో... ఆదేశిస్తున్నారో అర్థం కాలేదన్నారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు వెనుక కేంద్రంలోని బీజేపీ ఉందనే విషయం రాష్ట్రంలో ప్రతిఒక్కరికి తెలుసని, బీజేపీ సహకారంతోనే చంద్రబాబును 53 రోజులు జైలులో ఉంచారని అన్నారు. బీజేపీ, వైసీపీ కూడబలుక్కుని ఇదంతా చేశాయనేది సుస్పష్టమన్నారు. సుప్రీం కోర్టులో వాదనలు ముగిసి 70 రోజులు పైబడినా తీర్పు వెలువరించకపోవడం వెనుక బీజేపీ ఉందని ఆరోపించారు. ఇంతా చేసి పొత్తుల గురించి ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. అసలు ఆంధ్ర ప్రదేశ్‌కు బీజేపీ ఏమి చేసిందని నిలదీశారు. ప్రత్యేక హోదా ఇచ్చిందా, విభజన హామీలు అమలు జరిపిందా అంటూ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలు వైసీపీని నెత్తిన పెట్టుకుని తిరిగిందని, ఒకరకంగా రాష్ట్రం అప్పుల పాలైపోవడానికి బీజేపీ కూడా ఒక కారణమని అన్నారు. బెదిరింపు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్న తీరు చూస్తుంటే అసలు రాజకీయ స్వాతంత్ర్యం ఉందా అనే సందేహం తలెత్తుతోందన్నారు. ఏ సదాశయం కోసం ఆనాడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారో... ఆ ఆశయానికి తూట్లు పొడిచేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవానికి ఇది పరీక్షా సమయమని, తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన తెలుగుదేశం పార్టీ బీజేపీ నేతల బెదిరింపులకు లొంగిపోదని భావిస్తున్నామన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని పరిరక్షించడానికి టీడీపీ నేతలు తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డిని గద్దె దించడమే అజెండాగా సీపీఐ ముందుకు పోతుందని, దీనికి కలిసి వచ్చే పార్టీలను కలుపుకుపోతామని చెప్పారు.

సమస్యలపై స్పందించే సమయం లేదా?

తమ న్యాయమైన డిమాండ్ల కోసం లక్షలాది మంది రోడ్లపైకి వచ్చి సమ్మె చేస్తుంటే దీనిపై స్పందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి తీరిక లేకపోవడం శోచనీయమని రామకృష్ణ అన్నారు. కనీస వేతనాలు, ఇచ్చిన హామీల అమలు కోసం అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్న స్కీమ్ వర్కర్లతో పాటు మున్సిపల్ కార్మికులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, వలంటీర్‌లు, యానిమేటర్‌లు రోడ్లపైకి వస్తున్నారని, దీనికి ప్రధాన బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని సూచించారు.

రోమ్ నీరో చక్రవర్తి ఫిడెల్ వాయిస్తే... ఇక్కడ మన నీరో చక్రవర్తి ఎమ్మెల్యే, మంత్రులు, ఎంపీల బదిలీలలో మునిగిపోయారని ఎద్దేవా చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి ఒక రోజు కేటాయించి నాయకులను చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అయోధ్య రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని బీజేపీ ఎన్నికల ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 22న జరిగే ఈ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆసరాగా చేసుకుని రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమానికి తెరతీసిందని, తద్వారా ఎన్నికల లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మరోవైపు, రాష్ట్రంలో అంబేద్కర్ వాదుల ఓట్ల కోసం ఈ నెల 19న అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం అవుతున్నారని అన్నారు. కుటుంబ వ్యవస్థను దూరంగా పెట్టిన మోదీకి రామాలయాన్ని ప్రారంభించే అర్హత లేదని, అదేవిధంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న జగన్‌కు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఒకవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులకు తెగబడుతూ, మరోవైపు అమరావతి రైతులకు చెల్లించాల్సిన కౌలును తొమ్మిది నెలలుగా చెల్లించకుండా వారిని చిత్రహింసలకు గురిచేస్తున్న జగన్... సీఎంగా రాష్ట్రాన్ని పాలించే అర్హతను కోల్పోయారని అన్నారు. అమరావతి రైతులకు కౌలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో ఈ నెల 8న సీఆర్‌డీఏ కమిషనర్ వద్దకు 'రాయబార యాత్ర' చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో అమరావతి రాజధాని రైతులు, కౌలు రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్-5 జోన్ గతీ అంతే

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సింఘ్వీ వాదనలు వినిపిస్తూ పేదలకు సెంటు భూమి ఇచ్చి నివాస గృహాలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారని చెప్పారు. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందిస్తూ ఏం జరుగుతుందో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. మొత్తానికి ఈ పరిణామంతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు ఊపిరిపీల్చుకోగా, రాష్ట్ర ప్రభుత్వ దూకుడుకి కళ్లెం పడింది.

భారతీ సిమెంట్స్ కేసులోనూ ఎదురుదెబ్బ

భారతీ సిమెంట్స్ కేసులోనూ సీఎం జగన్‌కు చుక్కెదురైంది. జగన్ అక్రమాస్తుల కేసులో భారతీ సిమెంట్స్ ఎఫ్‌డీలపై తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. భారతీ సిమెంట్స్‌కు చెందిన రూ.150 కోట్ల ఎఫ్‌డీ మొత్తాన్ని విడుదల చేయాలని ఈడీని ఆదేశిస్తూ తెలంగాణ హైకోర్టు గతంలో ఆదేశించింది. బ్యాంకు గ్యారంటీలు తీసుకొని ఎఫ్‌డీలను విడుదల చేయాలని తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సవాల్ చేసింది.

పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా నేతృత్వంలోని ధర్మాసనం ఈడీ వాదనలతో ఏకీభవించింది. గతంలో ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని హైకోర్టుకు సూచించింది. బ్యాంకు గ్యారంటీలు తీసుకున్నాక కూడా ఎఫ్‌డీలను జప్తు చేశారని భారతీ సిమెంట్స్ తరపు న్యాయవాది ముకుల్ రొహత్గీ కోర్టు దృష్టికి తెచ్చారు. కనీసం ఎఫ్‌డీలపై వడ్డీనైనా విడుదల చేయాలని భారతీ సిమెంట్స్ మరో పిటిషన్ దాఖలు చేసింది. దీనినీ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఎఫ్‌డీల విడుదలకు హైకోర్టు ఇచ్చిన తీర్పునే పునఃపరిశీలించాలని సూచించినప్పుడు, జప్తు చేసిన దానికి వడ్డీ ఎలా వస్తుందని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ల విచారణ ముగిసినట్లు తెలిపింది. అభ్యంతరాలు ఉంటే హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం ధర్మాసనం సూచించింది.

వేడెక్కిన బెజవాడ రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస్(నాని)కి టికెట్ లేదని అధిష్ఠానం తేల్చిచెప్పింది. ఈ విషయాన్ని స్వయంగా ఎంపీ కేశినేని నాని ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. కొంతకాలంగా విజయవాడ ఎంపీ కేశినేని నానికి, ఆయన సోదరుడు కేశినేని చిన్నికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. విజయవాడ ఎంపీ టికెట్ తనదేనంటూ కేశినేని చిన్ని కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ తనకంటూ ఒక అనుచరవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల తిరువూరు టీడీపీ కార్యాలయం దగ్గర ఎంపీ కేశినేని నాని, కేశినేని చిన్ని అనుచరుల మధ్య విభేదాలు తీవ్రస్థాయికు చేరాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు తిరువూరులో బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సభను విజయవంతం చేయడంలో భాగంగా ఎంపీ కేశినేని, కేశినేని చిన్ని అనుచరులు పోటీ పడ్డారు. రెండు వర్గాలు బలప్రదర్శనకు దిగాయి. తుదకు వాగ్వివాదం, పరస్పర దాడులు చేసుకున్నారు. గాల్లోకి కుర్చీలు లేచాయి. అదుపుచేసేందుకు వచ్చిన పోలీసులు సైతం గాయపడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎంపీ కేశినేని నానిని రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనవద్దని అధిష్ఠానం సూచించినట్లుగా ఆయనే స్వయంగా ప్రకటించుకున్నారు. ఇక కేశినేనికి టికెట్టు రాబోదని ఆయన అనుచరులు భావిస్తున్నారు. కేశినేని స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి, అన్ని నియోజకవర్గాల్లో ఆయన అనుచరులను స్వతంత్ర్యంగా బరిలో దించే ఆలోచనలో ఉన్నారు. లేకుంటే వైసీపీలోకి పెద్దఎత్తున అనుచరులతో చేరేందుకు సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది.

తారస్థాయికి వర్గ విభేదాలు

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నుంచి టీడీపీలో వర్గ విభేదాలున్నాయి. విజయవాడ మేయర్ అభ్యర్థిగా కేశినేని కుమార్తె శ్వేతను రంగంలోకి దించి, ఆమెను కార్పొరేటర్‌గా ఎంపీ నాని గెలిపించారు. అదే సమయంలో టీడీపీలో పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన నేతలు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, బోండా ఉమామహేశ్వరరావు టీడీపీకి వ్యతిరేకంగా పనిచేశారని కేశినేని వర్గీయులు ఆరోపిస్తున్నారు. పరోక్షంగా వైసీపీకి వారు సహకరించినట్లు అనుమానిస్తున్నారు. దీంతోనే టీడీపీ ఎక్కువ కార్పొరేట్ సీట్లు సాధించలేకపోయిందని, కేశినేని నానికి చెక్ పెట్టేందుకు సొంత టీడీపీ నేతలు ప్రవర్తించినట్లు ప్రచారముంది. అప్పటి నుంచి టీడీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి. దీనిని ఆసరాగా తీసుకుని కేశినేని చిన్ని తన కార్యకలాపాలను వేగవంతం చేశారు. వ్యతిరేక వర్గాలను ఆయన కూడగట్టి ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ఈ వర్గ విభేదాలు టీడీపీకి పెద్ద తలనొప్పిగా మారాయి. కేశినేని నాని సైతం పార్టీ అధిష్ఠానం వైఖరిపై అనేకసార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరువూరు సభకు రావద్దని టీడీపీ అధిష్ఠానం ఆదేశించడంతో కేశినేని తన అనుచరులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఇప్పటివరకు తన బాస్ చంద్రబాబేనని, ఫిబ్రవరిలో తన నిర్ణయం ప్రకటిస్తానని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఆయన ఎలాంటి రాజకీయ నిర్ణయం ప్రకటిస్తారనే దానిపై టీడీపీలో ఉత్కంఠ నెలకొంది. టీడీపీతో బీజేపీ పొత్తు కుదిరితే ఈ సీటు బీజేపీకి ఇవ్వాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. బీజేపీ తరపున మాజీ ఎంపీ సుజనా చౌదరి రంగంలో దిగుతారని సమాచారం.

మల్లాది విష్ణు పక్క చూపులు

ఇక వైసీపీ విషయానికి వస్తే విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సీటు గల్లంతవ్వడంతో ఆయన పక్కచూపులు చూస్తున్నట్లు తెలిసింది. విజయవాడ సెంట్రల్ బాధ్యతలు పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అధిష్ఠానం అప్పగించింది. దీంతో వెలంపల్లికి సహకరించేది లేదంటూ మల్లాది విష్ణు అనుచరులు తెగేసి చెబుతున్నారు. ఇప్పటికే విజయవాడ సింగ్‌నగర్‌లోని మల్లాది విష్ణు కార్యాలయానికి వెలంపల్లి వెళ్లి మంతనాలు జరిపినప్పటికీ వారు వెనక్కితగ్గడం లేదు. అటు విష్ణు కూడా మౌనంగా ఉండిపోయారు. తాను అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తానని, ఎంతోకాలం నుంచి పశ్చిమ నుంచి పోటీ చేసినందున సీటు మార్చడంతో కొంత బాధ ఉందని వెలంపల్లి వాపోయారు. విజయవాడ సెంట్రల్ నుంచి తన కార్యకలాపాలు ప్రారంభించారు. ఇది గమనించిన మల్లాది విష్ణు వర్గం మరింత అసంతృప్తి చెందుతోంది. వెలంపల్లికి సహకరించడం లేదు. ఇటీవల విజయవాడ వచ్చిన షర్మిలను మల్లాది విష్ణు కలిసినట్లు ప్రచారముంది. దీంతో ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్తారని తెలిసింది.

జగన్‌నే బదిలీ చేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామని, ప్రతి రైతుకు వ్యవసాయ ఖర్చుల కింద రూ.25 వేలు ఇస్తామని, యువతకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలతో పాటు సంవత్సరానికి 4 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. జాబ్ క్యాలెండర్‌తో అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. 2019లో ఒక అవకాశం ఇస్తే రాష్ట్రాన్నే జగన్ దోచుకున్నాడని, అమరావతి రాజధాని కాదన్నాడని, మరి మూడు రాజధానులు ఎక్కడా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్, విద్యుత్ చార్జీలు ఎక్కువగా ఉన్నాయని, మరోపక్క విద్యుత్ బిల్లులు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. చెత్త నుంచి సంపద సృష్టిద్దామని మేము ప్రయత్నం చేస్తే చెత్తమీద పన్ను వేసిన సీఎం జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కు తీసుకెళ్లిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కుంభకోణాలు జరుగుతున్నాయన్నారు. సుపరిపాలన అంటే ప్రజల ఖర్చులు తగ్గించి, వారి ఆదాయం, జీవన ప్రమాణాలు పెంచడమని, కానీ రాష్ట్రంలో ఎక్కడా సుపరిపాలన లేదని విమర్శించారు. టీడీపీ హయాంలో ఉచిత ఇసుకను ఇస్తే ఇప్పుడు ఒక్క ట్రాక్టర్ ఇసుకను రూ.5 వేలు చేశారని తెలిపారు. మరోపక్క జగన్ నాసిరకం మద్యం అమ్మి పేదల రక్తాన్ని తాగుతున్నారని, తాము అధికారంలోకి వస్తే మద్యం ధరలు తగ్గిస్తామని తెలిపారు. ప్రకాశం జిల్లా జీవనాధారమైన వెలుగొండ ప్రాజెక్టును తామే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

కనిగిరిలో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జయహో బీసీ కార్యక్రమం ద్వారా బీసీల రుణం తీర్చుకుంటామన్నారు. స్థానిక సంస్థలను జగన్ నిర్వీర్యం చేశాడని, వలంటీర్లకున్న గౌరవం సర్పంచ్‌లకు లేకుండా పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సర్పంచ్‌ని గ్రామ మొదటి పౌరునిగా గౌరవిస్తామన్నారు. ప్రకాశం జిల్లాలో కొంతమంది ఎమ్మెల్యేలను పక్క నియోజకవర్గాలకు మార్చారని, మరికొందరికీ సీటు ఇచ్చే పరిస్థితి లేదని, ఇంకొంతమంది పోటీయే చేయలేమని తప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ బహిరంగ సభలో స్థానిక తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీతో పాటు మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు ఇన్‌ఛార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి, కొండేపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి, యర్రగొండ పాలెం ఇన్‌ఛార్జ్ ఎరిక్షన్‌బాబు, మార్కాపురం ఇన్‌ఛార్జ్ కందుల నారాయణరెడ్డి, టీడీపీ యువత నేత దామచర్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

రూ.4,797 కోట్లతో 'పృథ్వి'

- కర్బన ఉద్గారాలకు చెక్ పెట్టేలా యూఎస్ఏఐడీ - రైల్వే ఒప్పందం
- అయోధ్య విమానాశ్రయానికి వాల్మీకి పేరు - అంతర్జాతీయ హోదా
- చిన్న ఉపగ్రహాల తయారీకి ఇస్రో, ఎంఆర్ఐసీ ఒప్పందం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు



న్యూఢిల్లీ: కర్బన ఉద్గారాలకు చెక్ పెట్టేందుకు రైల్వేకు, యూఎస్ఏఐడీ ఒప్పందం, చిన్న ఉపగ్రహాల తయారీలో సహకారానికిగాను ఇస్రో, ఎంఆర్ఐసీ ఒప్పందంతో పాటు అయోధ్య విమానాశ్రయానికి మహర్షి వాల్మికి పేరు, అంతర్జాతీయ హోదా కల్పన, ఐదు సబ్ స్కీములను కలుపుకొని ముందుకెళ్లేందుకు 'పృథ్వి' పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ శుక్రవారం సమావేశమై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. భూ శాస్త్రాల శాఖ చేపట్టే పృథ్వి (పృథ్వి విజ్ఞాన్) పథకానికి ఆమోదం తెలిపింది. 2021-26లో రూ.4,797 కోట్లతో ఈ పథకాన్ని చేపట్టనున్నారు. చిన్న ఉపగ్రహాల అభివృద్ధికి సహకరించుకునేలా భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), మారిషస్ రీసెర్చ్, ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎంఆర్ఐసీ) మధ్య అవగాహన ఒప్పందం (మౌ)నూ కేబినెట్ ఆమోదించింది. కర్బన ఉద్గారాలను శూన్యం చేసే లక్ష్యాన్ని చేరుకునేందుకు భారతీయ రైల్వేకు మద్దతివ్వాలని యునైటెడ్ స్టేట్స్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఏఐడీ)తో భారత్‌కు కుదిరిన అవగాహన ఒప్పందంపై కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అయోధ్య ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ హోదా కల్పన, మహర్షి వాల్మికి అంతర్జాతీయ విమానాశ్రయం, అయోధ్యధామ్‌గా నామకరణానికీ అంగీకారం తెలిపింది. అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా అయోధ్యను తీర్చిదిద్దడం, విదేశీ యాత్రికులకు, భక్తులకు ద్వారాలు తెరవడంతో ఆయోధ ఆర్థికంగా పుంజుకోగలదన్న దృష్ట్యా ఈ నిర్ణయం జరిగినట్లు కేంద్ర కేబినెట్ సమావేశం అనంతరం వెలువడిన అధికారిక ప్రకటన తెలిపింది. అలాగే వాతావరణ-పర్యావరణ పరిశోధన, నమూనా పరిశీలన వ్యవస్థలు & సేవలు (ఎక్రాస్), ఓషియన్ సర్వీసెస్, మోడలింగ్ అప్లికేషన్, రీసోర్సెస్, టెక్నాలజీ (ఓ-స్మార్ట్), పోలార్ సైన్స్ & క్రియోస్ఫియర్ రీసెర్చ్ (పేసర్), సియస్మాలజీ, జియో సైన్సెస్ (సేజ్), రీసెర్చ్, ఎడ్యుకేషన్, ట్రైనింగ్, ఔట్‌రీచ్ (రీచ్‌ఔట్) వంటి ఐదు ఉప పథకాలతో 'పృథ్వి విజ్ఞాన్ (పృథ్వి) ఉంటుందని, రూ.4,797 కోట్లతో 2021-26లో అమలునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని అధికారిక ప్రకటన వెల్లడించింది. పెట్టుబడులు, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచుకునేలా భారత్-గయానా పెట్రోలియం, సహజ గ్యాస్ శాఖల మధ్య అవగాహన ఒప్పందానికీ ఆమోదం లభించింది. రిపబ్లిక్ ఆఫ్ గయానాతో హైడ్రో కార్బన్ రంగంలో సహకారానికీ ఏకాభిప్రాయం కుదిరింది. ఆత్మనిర్భర్ భారత్ విజన్‌తో అంతర్జాతీయ స్థాయిలో ఇంధనం, గ్యాస్ కంపెనీలతో కలిసి పనిచేసే అనుభవాన్ని పెంచుకునేందుకు గయానాలో ఈ&పీ రంగంలో భారతీయ కంపెనీకి స్థానం లభించే అవకాశం కోసం ఈ ఒప్పందం దోహదమవుతుందని ప్రకటన తెలిపింది. రైల్వే ఆధునికీకరణ, ప్రైవేటు వర్గ భాగస్వామ్యం, సాంకేతిక క్షేత్రాలైన పునరుత్పాదక ఇంధనం, సామర్థ్యంలో శిక్షణ, సెమినార్ల నిర్వహణ, ఆధునిక వ్యవస్థలు, ఇంధన పరిష్కారాల కోసం యునైటెడ్ స్టేట్స్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్‌తో అవగాహన ఒప్పందం జరిగినట్లు వెల్లడించింది. అయోధ్య విమానాశ్రయం పేరును మహర్షి వాల్మికి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, అయోధ్యధామ్'గా పెట్టడం ద్వారా రామాయణం రాసిన వాల్మికికి నివాళులర్పించడమే కాకుండా సంస్కృతికి చిహ్నంగా విమానాశ్రయం ఉండాలనే ప్రయత్నం జరిగిందని తెలిపింది. ఉమ్మడిగా ఉపగ్రహాల తయారీకి పరస్పరం సహకరించుకునేలా ఇస్రో, మారిషస్ రీసెర్చ్, ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎంఆర్ఐసీ) మధ్య ఒప్పందం జరిగిందని, భారతీయ పరిశ్రమల భాగస్వామ్యంతో ఉప వ్యవస్థలుంటాయి కాబట్టి ఈ పరిశ్రమకు ప్రయోజనం ఉంటుందని ప్రకటన తెలిపింది.

మోదీ సెల్ఫీ పాయింట్ల ఖర్చు ఎంత?

(మొదటిపేజీ తరువాయి)

మోదీకి ప్రచారం చేసి పెట్టే పెద్ద బోర్డులు ఎప్పటి నుంచో దర్శనం ఇస్తున్నాయి. అనేకచోట్ల మోదీ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయించారు. విశ్వవిద్యాలయాల పరిసరాల్లో కూడా మోదీ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయించారు. మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రచారం చేయడానికి ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ ఈ పథకాల అమలుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోట్లాది మందికి ఉపాధి కల్పించామని దండోరా వేయించుకుంటున్నారు. స్వచ్ఛ భారత్ పథకం, స్టార్టప్ ఇండియా ప్రచారం కూడా జరుగుతోంది. రైల్వే స్టేషన్లలో రెండు రకాల సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఒక రకం శాశ్వతమైనవి. వీటిని ఏర్పాటు చేయడానికీ ఒక్కో దానికి ఆరు లక్షల 25 వేల రూపాయలు ఖర్చు అవుతాయి. తాత్కాలిక సెల్ఫీ పాయింట్లకు లక్షా పాతిక వేల రూపాయలు ఖర్చు అవుతాయి. ఇలాంటి సెల్ఫీ పాయింట్లు వందలు, వేల సంఖ్యలో ఏర్పాటు చేశారు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ సమాచారం వెలికి వచ్చింది. ఈ సమాచారం ఇచ్చిన రైల్వే అధికారిపై బదిలీ వేటు వేశారు. ఒక్క రక్షణ శాఖే 822 సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసిందంటే మిగతా ప్రభుత్వ విభాగాలు ఎంత ఖర్చు పెట్టాయో ఆలోచించడం కూడా కష్టమే. ఇలాంటి విషయాలు సమాచార హక్కు చట్టం కింద ఇక ముందు బయటికి రాకుండా చట్టానికి సవరణలు కూడా జరిగిపోయాయి. ఈ సవరణ ప్రకారం ఇక ముందు రైల్వేలకు సంబంధించి ప్రజలకు ఏ సమాచారం ఇవ్వాలన్నా జోనల్ మేనేజర్ల, జనరల్ మేనేజర్ల అనుమతి తప్పనిసరి. రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన త్రీ డి సెల్ఫీ పాయింట్లకు డబ్బు భారీగా ఖర్చు అవుతుంది. ఇదంతా ప్రజల సొమ్మే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అంటే ప్రజల డబ్బుతో మోదీ ప్రచారం జోరుగా సాగిపోతోంది. రక్షణ దళాల వారు ప్రాణ త్యాగాన్ని సైతం మోదీ తన వ్యక్తిగత ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారు. ఈ ప్రచారార్భాటం అంతా 2024 మేలోగా జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో లబ్ధి పొందడానికేనని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మోదీ ప్రచారానికి రైల్వేల చేత డబ్బు ఖర్చు పెట్టించడం ఒక ఎత్తయితే అన్ని వర్గాల ప్రయాణికులకు వర్తించే రైల్వే టికెట్ల చార్జీలు పెంచేశారు. చివరకు ప్లాట్‌ఫాం టికెట్ల ధర కూడా పెరిగింది. ఈ రూపంలో సమకూరిన ఆదాయం మోదీ ప్రచారానికి మాత్రమే వినియోగించుకుంటున్నారు. దేశంలో తలసరి ఆదాయం తొమ్మిది నుంచి పది వేల రూపాయలు మాత్రమే. ప్రజల ఆదాయం పెరిగే మార్గం చూడవలసిన ప్రధానమంత్రి తన వ్యక్తిగత ప్రచారానికి ఖర్చు పెట్టిస్తున్నారు. జనాభాలో 81 మంది ప్రజలకు రెండు పూటలా తినే సదుపాయం కూడా లేదు. రైల్వేస్టేషన్లలో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు కానీ అదే రైల్వే ప్లాట్ ఫాంలపై రాత్రి పూట వేలాది మంది ఏ ఆచ్ఛాదనా లేకుండా నిద్ర పోవలసి వస్తోంది.

లోక్‌సభ ఎన్నికలపై ఈసీ కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

పర్యటనకు ముందు... వీరు ఎన్నికల సంఘానికి తమ నివేదిక ఇవ్వనున్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ముందు ఈసీ రాష్ట్రాల్లో పర్యటించడం సర్వసాధారణం. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు, సీనియర్ పోలీసులు, పాలనా విభాగ అధికారులు, క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందితో ఈసీ సమీక్షలు నిర్వహిస్తుంది. అయితే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈసీ బృందం పర్యటిస్తుందా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఇటీవలే ఎన్నికలు పూర్తయిన రాష్ట్రాల్లో పర్యటన ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఈసీ దేశవ్యాప్త పర్యటన పూర్తయిన అనంతరం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. 2019లో మార్చి 10వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగా... ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఫలితాలు ప్రకటించారు. ఈసారి కూడా ఏప్రిల్-మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆసియా కుబేరుడిగా అదానీ

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడినట్లు హిండెన్‌బర్గ్ గతేడాది ఆరంభంలో ఆరోపించింది. దీంతో గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి. ఓ దశలో అదానీ కంపెనీల మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్ల మేర తగ్గిపోయింది. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు అదానీ గ్రూప్ అనేక చర్యలు చేపట్టింది. రుణ వాయిదాలను గడువు కంటే ముందుగానే చెల్లించింది. ఇన్వెస్టర్లలో విశ్వాసం నింపేందుకు కొత్త పెట్టుబడిదారులతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. బ్యాంకుల నుంచి కొత్తగా రుణాలు సమీకరించుకుంది. దీంతో కంపెనీ షేర్లు తిరిగి గాడినపడ్డాయి. హిండెన్‌బర్గ్ నివేదికపై సెబీ దర్యాప్తు చేసి, అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలకు ఆధారాలు లేవని పేర్కొంది. సెబీ దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ చాలామంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సెబీ దర్యాప్తుపై తమకు విశ్వాసం ఉందని తెలిపింది. విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయడానికి నిరాకరించింది. పెండింగ్‌లో ఉన్న రెండు కేసులను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని సెబీకి సూచించింది. దీంతో అదానీ గ్రూప్ షేర్లు బాగా పుంజుకున్నాయి.

కరోనా కలవరం

24 గంటల్లో 12 మంది మృతి



న్యూఢిల్లీ: దేశంలో కరోనా మరణాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా కొత్తగా 761 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్రం పేర్కొంది. అయితే, యాక్టివ్ కేసుల సంఖ్య 4,423 నుంచి 4,334కి తగ్గినట్లు తెలిపింది. కేరళలో 1,249 క్రియాశీల కేసులు ఉండగా... కర్నాటకలో 1,240, మహారాష్ట్రలో 914, తమిళనాడులో 190, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లో 128 చొప్పున ఉన్నాయి. తాజాగా కేరళలో ఐదుగురు, కర్నాటకలో నలుగురు, మహారాష్ట్రలో ఇద్దరు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్రం వెల్లడించింది. కోవిడ్ ఉపరకం జేఎన్.1 వెలుగు చూసిన తర్వాత డిసెంబర్ 5 నుంచి దేశవ్యాప్తంగా రెండంకెల సంఖ్యలోనే కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఈ మధ్యకాలంలో చలితీవ్రత పెరగడంతో కోవిడ్ కేసుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఇటీవల కరోనా కారణంగా ఒకరిద్దరు మాత్రమే మృతి చెందగా, తాజాగా 24 గంటల వ్యవధిలోనే 12 మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది.

జగన్ మోసం

రావులపల్లి రవీంద్రనాథ్

విశాలాంధ్ర-పాయకాపురం: ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహనరెడ్డి...అధికారంలోకి వచ్చాక నిట నిలువునా మోసం చేశారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఫ్లైఓవర్ రోడ్డు సెంటర్‌లో వేతనాల పెంపు కోసం మున్సిపల్ కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులను భయపెట్టి, మోసగించి ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా హామీలు అములు చేయ లేదన్నారు. కార్మికులకు పనిభారం తగ్గించి రిటైర్‌మెంటు బెనిఫిట్స్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జక్కి జేమ్స్, రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రంగనాయకులు, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, ఏఐటీయూసీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు జె.రమేష్, నగర ఉపాధ్యక్షురాలు నిమ్మతోట భారతి, మున్సిపల్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే...

ప్రత్యక్ష ఆందోళన తప్పదు

మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరంలో సీపీఐ నేత రామకృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. అవసరమైతే సీపీఐ నాయకత్వాన తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఆయన శుక్రవారం సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన గాలికి వదిలేశారని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది మంది కార్మికులు రోడ్డుపైకి వచ్చి సమ్మె చేస్తుంటే పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల బదిలీల్లో తీరిక లేకుండా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమి చేసినా వైసీపీ ప్రభుత్వం ఓటమి ఖాయమని అన్నారు. సీఎం ఒక్క రోజు సమయం కేటాయిస్తే కార్మికుల సమస్యలను పరిష్కరించ వచ్చని అన్నారు. చట్టబద్ధంగా వారికి రావాల్సినవి మాత్రమే వారు అడుగుతున్నారని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా జగన్‌మోహన్ రెడ్డి సమస్యలను పరిష్కరించాలన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లా డుతూ పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ కుటుంబాలను వదిలేసి రోడ్లపై కూర్చుంటే గుంటూరు తూర్పు, పశ్చిమ వైసీపీ మహిళా ప్రతినిధులు స్పందించకపోవడం శోచనీయ మని అన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రసంగించారు. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్‌కుమార్, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్ జీ, నగర కార్యదర్శి శశి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి తదితరులు మద్దతు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కోటి వీరాంజనేయులు, గౌరవాధ్యక్షులు చిన్నపోతుల వెంకటరావు, సద్గుణరావు, భాస్కర్, జీవన్‌కుమార్, ఎలిషారావు, రమాదేవి, మరియమ్మ, విజయ్‌కుమార్, శ్రీను, సువార్తమ్మ, అన్న పూర్ణమ్మ, లక్ష్మణ, సుబ్రమణ్యం, బాలాజీ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

పరుచూరి రాజేంద్ర, లెనిన్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, అసలు ప్రభుత్వ శాఖల్లో గల ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక హనుమాన్‌పేటలోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టులు భర్తీ చేయాలని రాజేంద్ర, లెనిన్ డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తానని, ఇందుకోసం యేటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తానని వైఎస్ జగన్ హామీ ఇచ్చారని, ఆ హామీ ఇప్పటి వరకు అమలు కాలేదని విమర్శించారు. నిరుద్యోగ యువతను నిట్టనిలువున మోసం చేశారని మండిపడ్డారు. మెగా డీఎస్సీ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయ పోస్టుల కోసం గ్రామీణ యువత ఆశగా ఎదురు చూసిందని చెప్పారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 50,667 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎస్జీటీలతో అదనపు తరగతులు నిర్వహిస్తూ డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. దీనికిబదులు జాతీయ విద్యావిధానం పేరుతో అనేక ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు లంకె సాయికుమార్ పాల్గొన్నారు.

వైసీపీకి మరోషాక్

పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీకి మరోసారి షాక్ తగిలింది. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి సీఎం జగన్ అపాయింట్‌మెంట్ కోసం ఆయన వచ్చారు. ఇప్పటికే కాపు రామచంద్రారెడ్డికి సీటు లేదంటూ అధిష్ఠానం తెలిపింది. దీనిపై తనకు టికెట్ ఇవ్వాలని క్యాంపు కార్యాలయానికి వచ్చి సీఎంను కలిసేందుకు ప్రయత్నించారు. అయితే ఆయనకు అపాయింట్‌మెంట్ దొరకపోవడంతో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. మీకు టికెట్ లేదని సజ్జల చెప్పడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అనంతరం కాపు రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ సర్వేల పేరుతో తనకు టికెట్ రాదని చెప్పారన్నారు. జగన్‌ను నమ్ముకుని వైసీపీలోకి వచ్చానని, వైసీపీ కోసం గడప గడపకు తిరిగామని వివరించారు. జగన్ చెప్పిన ప్రతి పని చేశానని, వైసీపీ నుంచి తాను వెళ్లిపోతున్నట్లు తెలిపారు. జగనే నా సర్వస్వం అనుకున్నానని, మా జీవితాలు సర్వనాశనం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి నేను, రాయదుర్గం నుంచి నా భార్య స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని వెల్లడించారు. ఇప్పటి వరకు తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి అనేక సార్లు రామచంద్రారెడ్డి వచ్చినప్పటికీ ఫలితం లేదు.

జగన్ విచ్ఛిన్నకర విధానాలు విడనాడాలి

ఏఐటీయూసీ (జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ సుబ్బారాయుడు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా తమ హక్కుల సాధన కోసం మున్సిపల్ కార్మిక జేఏసీ చేపట్టిన సమ్మెను విచ్ఛిన్నం చేసే విధానాలను వైసీపీ ప్రభుత్వ విడనాడాలని మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ (ఏఐటీయూసీ) రాష్ట్ర కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బ రాయుడు అన్నారు. శుక్రవారం విశాఖలో ఏఐటీయూసీ అధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమ్మెలో ఉన్న కార్మికుల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పడాల రమణ అధ్యక్షతన జరిగిన సభలో సుబ్బారాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారని అన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయకుండా, పోటీ కార్మికులను రంగంలోకి దింపి కార్మికుల మధ్య ఘర్షణలకు తావిస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా అధికారుల ద్వారా షోకాజ్ నోటీసులు ఇచ్చి కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం ఉదయం సంధ్యాలలో పోటీ కార్మికులను దింపితే అడ్డుకున్న సమ్మెలోని కార్మికుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించడం సిగ్గు చేటన్నారు. జీవీఎంసీలో కొంతమంది నాయకులు పర్మనెంట్ పారిశుద్ధ్య కార్మికులు, ఇతర ఉద్యోగులను సమ్మెలోకి దిగొద్దని కుట్రలకు దిగుతున్నారని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏలు విడుదల చేయాలని, ఏపీజీఎల్ఐ బాండ్లలో ఉన్న సొమ్ము చూపాలని, జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని, మినిమం టైం స్కేల్ వారిని రెగ్యులరైజ్ చేయాలని, పని సర్దుబాటు పేరుతో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ హెల్త్ డ్రైవర్లకు, శానిటేషన్ సూపర్‌వైజర్లకు క్యాడర్ హోదా కల్పించి వేతనాలు చెల్లించాలని పోరాడుతుంటే ఈ ఎన్జీవో నేత బొప్పరాజు అధికార పార్టీ ముసుగులో నిద్రపోయారా అని ప్రశ్నించారు. ధరలకు అనుగుణంగా పీఆర్‌సీ నిర్ణయించిన మేరకు బేసిక్ పే, ఇతర అలవెన్సులు ఇవ్వాలని అడగటం నేరమన్నట్లు ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి పర్యటనలకు పట్టణాలను సుందరీకరణ చేసే పారిశుద్ధ్య కార్మికులను విస్మరిస్తున్న సీఎం జగన్ వ్యవహారశైలి ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. వృద్ధాప్యంలో బిక్కు బిక్కుమంటూ రిటైర్డ్ కార్మికుడు బతకాలా అని ప్రశ్నించారు. అందుకే రూ.5 లక్షల గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ (ఏఐటీయూసీ) నాయకులు కె.సత్యనారాయణ, జి.ప్రకాష్, బంగారు దుర్గారావు, లింగాల వెంకటేష్, కిలారి శివ, పిట్టా కిషోర్, దోలా ప్రసాద్, ఎం.బంగారయ్య, కొర్రయి వాసు, సబ్బి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్

నేటి విశాఖ సభలో ఉద్యోగులందరూ పాల్గొనాలని పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖ పట్నం: మున్సిపల్ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరిం చాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం జేమ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవీ ఎంసీ జేమ్స్ గౌరవ అధ్యక్షులు వి.వి. వామనరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. పలిశెట్టి మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 7వ తేదీ ఆదివారం గురుజాడ కళాక్షేత్రంలో జరిగే సభకు మున్సిపల్ ఉద్యోగులందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని మున్సిపల్ ఉద్యోగులందరినీ ఐక్యం చేసి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ధ్యేయంతో ఏపీజేఏసీ అమరావతికి అనుబంధంగా ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ మొదటి రాష్ట్ర మహాసభను ఈ నెల 7న విశాఖ సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ, మున్సిపల్ ఉద్యోగుల సారథ్యంలో జరగనున్న మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఉద్యోగులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేశ్‌ను ఆహ్వానించామన్నారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. అనంతరం వామనరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ మహాసభకు జీవీఎంసీ అన్ని విభాగాలు ఒక తాటిపై వచ్చి జయప్రదం చేయాలన్నారు. మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు మాట్లాడుతూ ఉద్యోగులందరూ జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి గురజాడ కళాక్షేత్రం వరకు జరిగే ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ముప్పల రవి, మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (జీవీఎంసీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీతల వెంకటేశ్వరరావు, బిర్లంగి శంకర్, జేమ్స్ నాయకులు సన్నీ, హరిగోపాల కృష్ణ, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గోందు సీతారాం, గుమ్మడి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన మార్పిడికి సదస్సులు దోహదం

వీఐటీలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభంలో వక్తల ఉద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణుల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి, జ్ఞానమార్పిడికి సదస్సులు వేదికగా ఉపయోగ పడతాయని వక్తలు పేర్కొన్నారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అధ్వర్యంలో అడ్వాన్సెస్ ఇన్ డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్‌పై 5వ అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సును రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్‌లో అభివృద్ధి పరిణామాలపై చర్చించనున్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుమీత్ వర్మ (ఇంటెల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో డైరెక్టర్ (స్ట్రాటజీ) మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి, సంబంధిత అంశాలపై విశ్లేషణాత్మక ఉపన్యాసం చేశారు. సదస్సుకు ప్రముఖ కన్వీనర్లుగా డా.ఉమాకాంత్ నందా, డా.రవీంద్ర ధూలి వ్యవహరించగా, డా.లఖన్ దేవ్ శర్మ, డా.రోహిత్ లోరెంజో జనరల్ చైర్స్‌గా వ్యవహరించారు. వీఐటీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటా రెడ్డి విశ్వవిద్యాలయం ప్రగతి, అకడమిక్ విజయాలను వివరించారు. ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలకు చెందిన దాదాపు 200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు.

9న 'అనంత' తెలుగు భాషా వైభవ సదస్సు

సాహితీమూర్తులకు పురస్కారాలు: విజయబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనంతపురంలో ఈనెల 9న అనంత తెలుగు భాషా వైభవ సదస్సు నిర్వహిస్తున్నామని, తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన 90 మందిని సత్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు తెలిపారు. విజయవాడ ఇరిగేషన్ కాంపౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయబాబు మాట్లాడుతూ సదస్సుతో పాటు భవిష్యత్‌లో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రజలను కోరారు. అనంత తెలుగు భాషా వైభవ సదస్సులో 10 మంది సాహితీవేత్తలకు జీవిత సాఫల్య పురస్కారాలు, 40 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. మరో 40 మంది కవులు, కళాకారులను సత్కరిస్తామన్నారు. అలాగే మీడియా రంగంలో వ్యాస రచయితలకు అంటే తెలుగు భాష మీద పట్టున్న 'ఫీచర్ రైటర్లకు' కూడా పురస్కారాలు ఇస్తామన్నారు. అనంతపురం జిల్లా సాహిత్య వైశిష్ట్యం భాష, పద్య కవిత్వం, ఆధునిక కవిత్వం, నవల, కథానిక, జానపదం, బళ్లారి రాఘవ నాటకం, సాహిత్య విమర్శ, సాహిత్యంలో హాస్యం వంటి ప్రత్యేక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జయహో శ్రీకృష్ణదేవరాయలు నృత్యరూపకం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు రచయితలు, కవులు, సాహితీమూర్తుల జాబితాను నవీకరిస్తున్నామని, ఇందులో చేర్చాల్సిన వారి పేరు, చిరునామా, చరవాణి, మెయిల్ అడ్రస్, రచనలు తదితర వివరాలను olcommissionap@gmail. comకు పంపాలని విజయబాబు కోరారు. ఈ సమావేశంలో భాషా సంఘం సభ్యులు ఆచార్య రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చరిత్రకారులకు ఇదే పెద్ద పండుగ

నేటి నుంచి విశాఖలో ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ వార్షిక సభలు

ఆచార్య కె.తిమ్మారెడ్డి వెల్లడి



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: నేటి పాలక ప్రభుత్వాల విధానాల వల్ల అంతరించి పోతున్న చరిత్రను రేపటి తరానికి తెలియజేసేలా శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సభలు విశాఖపట్నంలోని డా. బుల్లయ్య కళాశాలలో జరుగనున్నాయి. కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర సంఘం ఈ సభలు జరుపుతున్నట్లు నిర్వాహకులు ఆచార్య కె.తిమ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి చరిత్ర, సంస్కృతి చూస్తే ఆందోళన కలుగుతోందని, కళాశాలల్లో చరిత్రను బోధించే అధ్యాపకులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్య విద్యార్థులకు అందడం లేదన్నారు. చరిత్ర తెలియాలంటే చరిత్ర, సంస్కృతిపై నిత్యం పరిశోధనలు జరగాలన్నారు. పర్యాటకాన్ని ప్రోత్స హిస్తున్న ప్రభుత్వాలు చరిత్ర లేకుండా పర్యాటకం ఉండే పరిస్థితి లేదన్నారు. చారిత్రక కథనాల పరిశోధనకు ఈ సభలు ఎంతగానో దోహదపడ తాయని తెలిపారు. 1976లో కావలి జవహర్ భారతి కళాశాలలో డా.మలిరెడ్డి పట్టాభిరామరెడ్డి చొరవతో మొదలైన ఈ చరిత్ర సంస్థ క్రమం తప్పకుండా వార్షిక సభలు జరుపుకుం టుందన్నారు. ఈ సభలలో సమర్పించిన పరిశోధక పత్రాలను ఎంపిక చేసి ఇప్పటివరకు 45 సంపుటాలను ప్రచురించిందన్నారు. ఇవి పరిశోధకులకు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ సంస్థ జరిపిన కృషితో అనేక మంది సీనియర్ చరిత్రకారులు, వర్ధమాన చరిత్రకారులు తమ పరిశోధనలను ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక చరిత్ర రచన విభాగాల్లో సమర్పించి, చర్చించి తద్వారా తెలుగు చరిత్ర, సంస్కృతులను సంపన్నం చేశారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని 1926లో విశాఖలో స్థాపించగా, అప్పటి వైస్ ఛాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డి విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ఎంపిక చేయడంలో ఆయన భావుకత, అభిలాష నేటి విద్యార్థులను ఉత్తేజపరుస్తూ వస్తున్నాయన్నారు. కట్టమంచి వేసిన అధ్యయన పునాదులపై ఆ తర్వాత వచ్చిన అధ్యాపక ప్రముఖులు సర్వేపల్లి రాధాకృష్ణన్ వైస్ ఛాన్సలర్‌గా పని చేశారని, హుమయూన్ కబీర్, హీరేన్ ముఖర్జీ, అబ్బూరి రామకృష్ణారావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, గొర్తి వెంకటరావు, గంటి జోగిసోమయాజి, కె.ఆర్. శ్రీనివాస య్యంగార్, ఉపాధ్యక్షులు వాసిరెడ్డి శ్రీకృష్ణ, వేణుగోపాలస్వామి, సర్వేశ్వరరావు వంటి వారితో విశ్వవిద్యాలయం ఖ్యాతి నలుదిశలా వ్యాపించిం దన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి చరిత్రకారులు, రొమీలా థాపర్, సర్వేపల్లి గోపాల్, బరుండే, బిపన్ చంద్ర, సవ్యసాచి భట్టాచార్య మరెందరో ప్రముఖులు ఈ సభల్లో పాల్గొన్నారని తెలిపారు. 45 వార్షిక సభలు జరుపుకొని, ప్రస్తుతం 46వ వార్షిక సభలు విశాఖలో ఆచార్య కె.సి.రెడ్డి నేతృత్వంలో జరగనున్నాయన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరై వివిధ చారిత్రక విభాగాల్లో పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారని, కీ.శే. ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య స్మారకోపన్యాసం ఉంటుందని వివరించారు. శనివారం ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా మాజీ డీజీపీ పి.ఆంజనేయ రెడ్డి హాజరవుతారని, గౌరవ అతిథులుగా ఆచార్య కె.సి.రెడ్డి (ప్రిన్సిపాల్ బుల్లయ్య కళాశాల), ఆచార్య కె.సమత (ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్), ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ జి.మధుకుమార్ (కార్యదర్శి, బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్), ఆచార్య మాజేటి సోమశేఖరరావు (ఏపీ చరిత్ర సంఘం జనరల్ ప్రెసిడెంట్), డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి (ఏపీ చరిత్ర సంఘం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి) పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ముప్వ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కె.వి.రమణమూర్తి, ఆచార్య జి.వెంకట రామయ్య, బి.ప్రసాద్ రెడ్డి, ఎస్.మురళీమోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి కారు బోల్తా

పీఏ వెంకటేశ్వర్లు మృతి, ఎమ్మెల్సీకి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రయాణిస్తున్న కారు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రేగడిచెలిక సమీపంలో గురువారం అర్ధరాత్రి రాత్రి దాటిన తర్వాత రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆయన విజయవాడ నుంచి నెల్లూరు వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఎమ్మెల్సీ కారుకు ముందు వెళుతున్న లారీ టైరు పంక్చరు కావడంతో ఒక్కసారిగా నెమ్మదించింది. ఆ క్రమంలో కారు వెళ్లి లారీ వెనుక భాగంలో ఢీకొని డివైడర్‌పై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ రెడ్డి పీఏ అక్కడికక్కడే మృతి చెందగా, ఎమ్మెల్సీ తలకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారులో అయిదుగురు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

పరామర్శించిన నేతలు: ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని శుక్రవారం అనేక మంది పరామర్శించారు. మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న చంద్రశేఖర్ రెడ్డిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ నేత వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, అలాగే ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నల్లపురెడ్డి వినోద్ రెడ్డి తదితరులు చంద్రశేఖర్ రెడ్డిని పరామర్శించారు.

అబద్ధాలకోరు మోదీ

అదానీ, అంబానీ గుప్పెట్లో దేశ సంపద

వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శ

విశాలాంధ్ర-ఒంగోలు: అబద్ధాలు నమ్మించడంలో అగ్రగణ్యుడు ప్రధాని నరేంద్ర మోదీ అని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజమెత్తారు. ఒంగోలులో ఆచార్య రంగా భవనంలో శుక్రవారం ప్రకాశం జిల్లా సమితి అధ్వర్యంలో ఈనెల 12వ తేదీన విజయవాడలో నిర్వహించే భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతోందన్నారు. ప్రజాహక్కులను కాలరాస్తోందని చెప్పారు. రైతు హక్కులు హరించడానికి అదానీ కార్యాలయంలో రూపొందించిన మూడు సాగు చట్టాలను పార్లమెంటులో ఆమోదింపచేసుకుందని ఆరోపించారు. అది కూడా కరోనా సమయంలో మెజారిటీ సభ్యులు లేని సమయంలో చేసిందని గుర్తుచేశారు. దేశంలో 12 పోర్టులను, ఆరు విమానాశ్రయాలను అదానీకి కట్టబెట్టిందన్నారు. ఇప్పటికీ కార్పొరేట్ శక్తులకు దేశ సంపద దోచిపెడుతోందని ఆరోపించారు. 2024 ఎన్నికలలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే మనువాద రాజ్యాంగాన్ని అమలులోకి తెస్తారని హెచ్చరించారు. బీజేపీ హటావో, దేశ్ బచావో నినాదంతో ఈనెల 12వ తేదీన విజయవాడలో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది హాజరై సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూత్ ఫర్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు యు.వేదవతి మాట్లాడుతూ పాలకులు ప్రైవేట్ రంగాన్ని నిర్లజ్జగా ప్రోత్సహిస్తున్నారని, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మేధావులపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు గెలవాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో నరహంతకుల పాలన సాగుతోందన్నారు. మోదీ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. కార్పొరేట్ శక్తుల అభ్యున్నతి కోసం రాజ్యాంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసి పాలన సాగిస్తున్నారన్నారు. రైతన్నల ఆదాయం రెట్టింపు చేస్తామని, రైతు ఆత్మహత్యలకు స్వస్తి పలుకుతామని, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్న ఏ ఒక్క హామీ అమలు కాలేదని విమర్శించారు. పైగా వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం ప్రజల ఆస్తులకు ఎలాంటి రక్షణ ఇవ్వదన్నారు. దీనిని వెనక్కి తీసుకోకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరిం చారు. అమరావతి రాజధానిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటకెక్కించాయని ఆరోపించారు. రానున్న ఎన్నికలలో బీజేపీ, దాని మద్దతు పార్టీలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక నాయకురాలు కె.అరుణ మాట్లాడారు. రైతు, ప్రజాసంఘాల నేతలు వడ్డే హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, జుజ్జురి జయంతి బాబు, పమిడి వెంకట్రావు, చుంచు శేషయ్య, కొత్తకోట వెంకటేశ్వర్లు, పీవీఆర్ చౌదరి, ఎస్‌డీ సర్దార్, ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్.లలితకుమారి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కరవది సుబ్బారావు, ఓర్సు శ్రీనివాసరావు, పేరయ్య, దేవరపల్లి సుబ్బారెడ్డి, ఎస్‌కే బాబు, వి. బాలకోటయ్య, కంకణాల రమాదేవి, భీమవరపు సుబ్బారావు, రఫీ, దాసరి సుందరం, డాక్టర్ రావిపాటి ప్రసాదరావు, డాక్టర్ నాదెండ్ల చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. లింగంగుంటకు చెందిన రైతు మంగమూరి ప్రసాద్‌కు సన్మానం చేశారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Short Tender Notice No.78/2023-24/SE(W-IV)/EE-VII/DB/Dt:03.01.2024

Number of Works : 1 No, Value of Works (ECV) : Rs.162.66 Lakhs

Downloading Starting Date	: 03.01.2024 @ 2.00 P.M.,
Downloading End Date	: 10.01.2024 @ 2.00 P.M.,
Date of Opening Tenders	: 10.01.2024 @ 3.00 P.M.,
Date of TQ Opening Date	: 12.01.2024 @ 3.00 P.M.,

Tele phone No. 9966333342; E-Mail ID: eeakp2015@gmail.com.,
E-Tender Website : https://tender.apeprocurement.gov.in/

Note: Any addendum / corrigendum / bid clarifications / time extension shall be issued on the website only. No separate press notification shall be issued.

For Commissioner

సంపాదకీయం

నల్లచట్టాలపై కదలిక ఏదీ?

కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయతలపెట్టిన నేరచట్టాల పట్ల దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. ఈ మధ్యనే లారీలు, ట్రక్కుల డ్రైవర్లు, భారీ వాహన యజమానులు మూడు రోజులపాటు ఆందోళన చేపట్టారు. విచిత్రమేమిటంటే, ఈ నిరసనలకు ప్రతిపక్షాలు నాయకత్వం వహించ లేదు. ఈ చట్టాలతో హతాశులైన వర్గాలు మాత్రమే ఈ ఆందోళనకు పూనుకున్నాయి. అసలు ఈ చట్టాలేమిటో, దాని సారాంశమేమిటో ఇప్పటికీ న్యాయమూర్తులు, న్యాయవాదులకు సైతం పూర్తిగా తెలియదు. ఒక్కొక్క సెక్షన్ గురించి అవగాహన చేసుకుంటూ ఉంటే వాటి తీవ్రత అర్థమవుతోంది. ముఖ్యంగా ఐపీసీ స్థానంలో వచ్చిన భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) పూర్తిగా అమలైతే సమీప భవిష్యత్ తరాలు 'పౌరహక్కులు అనేవి ఒకప్పుడు భారత్‌లో ఉండేవి' అని చెప్పుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. కొత్త నేర చట్టాల ఆమోదమే ఓ ప్రహసనం. దాదాపు ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేసి పార్లమెంటులో ఆమోదింపజేసుకున్న నల్లచట్టాల్లో ఇవి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ మూడు చట్టాల్లోని లొసుగులను ఆనాడే 'గోదీ'యేతర మీడియా ఘోషించింది. నిలువునా ఫాసిస్టు విషబీజాలతో వికటాట్టహాసం చేసే మోదీ సర్కారు అవేవీ పట్టించుకోలేదు. శతాబ్దకాలంనాటి చట్టాలను మార్చాలంటే సుదీర్ఘచర్చ జరపాలన్న ఇంగితజ్ఞానం బీజేపీకి లేకకాదు. నియంతృత్వ భావజాలమే దాని స్వరూపస్వభావాలు కాబట్టి అది జరగలేదు. ఈ చట్టాలతో సంఘ్‌పరివార్ విశ్వరూపం బయల్పడింది. ప్రస్తుతానికి ట్రక్కర్ల సమ్మెను నిలుపుదల చేయించేందుకు తాత్కాలికంగా ఈ చట్టాల అమలును ఆపినా, వాటిని గణతంత్ర దినోత్సవం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు మోదీ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండటం ఆందోళనకరం. అతివేగం, నిర్లక్ష్యపూరిత చర్యల కారణంగా వాహనం నడిపి రోడ్డుపై వ్యక్తుల మరణానికి కారణమైతే, ఆ నేరానికి పాల్పడిన డ్రైవరుకు పదేళ్ల జైలు శిక్ష, లక్షలాది రూపాయలు జరిమానా విధిస్తూ బీఎన్ఎస్‌లోని 106వ సెక్షన్ పేర్కొంటున్నది. పాత చట్టం ఐపీసీలోని 304ఏ సెక్షన్ స్థానంలో ఇది వచ్చింది. కేవలం ఫాసిస్టు దేశాలు, ఒక తరహా ముస్లిం చట్టాలు అమల్లో ఉన్న దేశాల్లో మాత్రమే ఇలాంటి చట్టాలు, శిక్షలు ఉంటాయి. అందుకే ఆరంభంలోనే డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ట్రక్కర్ల సమ్మె అనూహ్యం. ముఖ్యంగా ఉత్తరాది ప్రాంతంలో వేలాది లారీలు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాలు నిలిచిపోయాయి. పెట్రోల్ బంకులు వెలవెలబోయాయి. సరుకు రావాణా నిలిచిపోయింది. మార్కెట్ పడిపోయింది. ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్‌తో ప్రభుత్వం జరిపిన చర్చల్లో నిజాయితీ మృగ్యం. అందుకే ట్రక్కర్ల సమ్మెను పునరుద్ధరించే అవకాశాలను త్రోసిపుచ్చలేం. ఈ మధ్యనే ఇజ్రాయిల్‌లో అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహూ ప్రాథమిక చట్టాలను సవరించడానికి ప్రయత్నించారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ఆయనను తీవ్రంగా మందలించింది. న్యాయవ్యవస్థపై కాకుండా పశ్చిమాసియా యుద్ధ విరమణపై దృష్టి పెట్టాలని మొట్టికాయలు వేసింది. మనదేశంలో అలాంటి పరిస్థితి లేదు. గత కొన్ని సంవత్సరాలుగా వెలువడుతున్న తీర్పులే ప్రజలను సందిగ్ధంలో పడేస్తున్నాయి. కోర్టు ధిక్కార భయాలు ఎక్కువయినందున ఏమీ అనడానికి లేదు, మాట్లాడటానికి లేదు. దురదృష్టకరం, విచారకరమని వ్యాఖ్యానించడం తప్ప. తాజాగా నేరచట్టాలపై సుప్రీంలో కేసులు దాఖలయ్యాయి. ఈ మధ్యనే అదానీకి జైకొట్టినట్లు, 'ఈ విషయంలో మేం జోక్యం చేసుకోలేం' అని తీర్పులొచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు. మోదీ నేరచట్టాలను ఉపసంహరించుకోవాలంటే ఒక్కటే మార్గం. ప్రజా ఉద్యమం. పార్టీలన్నీ ఎన్నికలు, సీట్ల గోలలో ఉన్నందున మహోద్యమాలను ఆశించలేం. కొత్త చట్టాల కారణంగా కోర్టుల్లో మారిన సెక్షన్ నంబర్లకు అలవాటు పడటానికే న్యాయవాదులకూ, న్యాయమూర్తులకూ కొన్నేళ్లు పట్టవచ్చని న్యాయనిపుణులు అంటున్నారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను మార్చాల్సిందే. కాకపోతే ఉద్దేశం అంతకుమించిన అరాచక చట్టాలను అమలు చేయాలని కాదు. పార్లమెంటరీ విధివిధానాలను, పూర్వోదాహరణలను ఉల్లంఘించి, ఎలాంటి సంప్రదింపులు, చర్చలు లేకుండా, ఎంపీలను మూకుమ్మడిగా సస్పెండ్ చేసి చట్టాలను తెచ్చిన తర్వాత, వీధిపోరాటలొక్కటే మిగిలాయి. అదే ప్రజాశక్తి. మోదీ సర్కారు మెడలు వంచాలంటే అదొక్కటే మార్గం. అఖిలపక్ష ప్రమేయం లేకుండా, చట్టాలను అనుభవించే వర్గాలను సంప్రదించకుండా బిల్లులను తయారు చేయడం గత తొమ్మిదేళ్లుగా ఈ దేశంలో పరిపాటిగా మారింది. బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ బిల్లుల తయారీలో సెలక్ట్ కమిటీల పాత్ర కూడా లేదు. స్థాయీసంఘాల పరిశీలన లేదు. శాసన పరిశీలన లేనేలేదు. ప్రతిపక్ష ఎంపీలకు ఎలాగూ తెలీదు. పాలక పార్టీ ఎంపీలకు కూడా ఈ బిల్లు గురించి తెలీదు. మోదీషా నేతృత్వంలోని సంఘ్ శక్తులతో కూడిన ఒక ఫాసిస్టు కమిటీకి మాత్రమే ఈ బిల్లులూ, దానిలోని సారమూ తెలుసు. కరోనాకు ముందు ఏకంగా 16 కీలకమైన బిల్లులు సెలక్ట్ కమిటీకి వెళ్లకుండానే లోక్‌సభ బల్లపైకి చేరాయి. సీఏఏ-ఎన్ఆర్‌సీ-ఎన్‌పీఆర్ విషయంలోనూ ఇదే జరిగింది. పౌరసత్వ బిల్లుపై నిరసనలు మిన్నంటాయి. అంతకుముందు రైతులు నల్లచట్టాలపై ఉవ్వెత్తున ఉద్యమించారు. లేబర్ కోడ్‌పై కార్మికులు తమ ఆందోళనలతో దేశాన్ని అట్టుడికించారు. కులమతాలు, వర్గాలకతీతంగా సాగిన ఈ ఉద్యమాలు దేశ చరిత్రలోనే మేలిమలుపు. ఇవన్నీ ప్రజాందోళనలే. నేరచట్టాలపై పెద్దగా స్పందించడం చేతకాని ప్రతిపక్షాలు సైతం గుణపాఠాలు నేర్చుకోదగ్గ ఉద్యమాలివి. మోదీ విధానాలపై పౌరహక్కుల నేతలు, సామాజిక కార్యకర్తలు, మేధావులు, పాత్రికేయులు గళంవిప్పి అరెస్టయిన సందర్భాలు కోకొల్లలు. ఇప్పుడు డ్రైవర్ల ఆందోళన కూడా ఆ కోవలోనిదే. వారిని చూసైనా కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలు, కుర్చీ కదలకుండా కాపాడుకునే యత్నంలో కేంద్ర తప్పిదాలను విస్మరించిన ప్రాంతీయ పార్టీలు మేల్కొని మోదీ సర్కారుపై తిరగబడేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. రాజ్యాంగబద్ధమైన, ప్రజాస్వామ్యయుత సూత్రాల ప్రాతిపదికగా ఏర్పడిన స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగ విలువలను త్రోసిరాజని సమర్థవంతమైన పాలన, హుందాతో కూడిన పాలనా ప్రక్రియను గాలికొదిలేసి, చట్టాలు చేస్తున్న తీరు అత్యయిక పరిస్థితికి అద్దంపడుతోంది.

నిద్రపోతూ డ్రైవింగ్ చేయకూడదు. అలా చేస్తే ప్రమాదాలు సంభవిస్తాయి. దానికి శిక్షలుంటాయి. కానీ నిద్రపోతూ చట్టాలు చేయొచ్చా? ఫాసిజం మత్తులో బిల్లులు రూపొందించి జనాల మీద రుద్దేయవచ్చా? ముస్సోలినీ చట్టాలకూ, మోదీ చట్టాలకూ తేడా ఏముంది? దేశంలో నియంతృత్వ, సామ్రాజ్యవాద రాజ్య స్థాపనకు ప్రతినబూనిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే కనీసం 30 వరకూ నల్లచట్టాలను ఆమోదించింది. ప్రజా ఉద్యమానికి ప్రజాస్వామ్యవాదులు పూనుకోకపోతే భవిష్యత్ భారతం ప్రమాదంలో పడిపోతుంది.

కవిత్వ పందిరి నీడలో....

ఈ మధ్య వాట్సాప్‌ల్లో రెండు వీడియోలు తెగ వైరల్ అయ్యాయి. కూతుర్ని అత్త వారి ఇంటికి పంపుతున్నప్పుడు ఆ తండ్రి పక్కకు వెళ్లి కన్నీళు పెట్టుకుంటున్న వీడియోలు అవి. ఓ వీడియోలో కారు వెనుక ఆ తండ్రి పరుగులు తీశారు. అవి చూసిన నాకు నా కూతుర్ని తొలిసారిగా స్కూల్ దగ్గర దింపి కన్నీరు కార్చిన దృశ్యం గుర్తుకొచ్చింది. ఇదే సంఘటనను ఓ రెండున్నర దశాబ్దాల క్రితం కవిత్వీకరించారు ఆనాటి ఓ కొత్త కవి. ఆ పద్యం ఇలా ప్రారంభమవుతుంది.

" నాకు మెలకెత్తిన ఓ సుందర చైతన్యాకృతి
నాకే వీడ్కోలిస్తున్నప్పుడు
ఇన్నాళ్లూ..! గుండె గదిలో వొదిగి వొదిగి
కళ్లకేదో మంచు తెర కప్పి
చూస్తూ చూస్తూనే గువ్వలా ఎగిరిపోయినట్టుంది
సైబీరియన్ పక్షిలా వలస పోయినట్టుంది"

ఈ పద్యానికి ఆ కవి పెట్టిన పేరు "వలసపోయిన మందహాసం". ఆ కవి ముకుంద రామారావు. ఈ కవిత ఓ సంచలనం. చేరా అనే విమర్శకుడు రాసిన అతి తక్కువ మంచి వ్యాసాల్లో ఇది కూడా ఒకటి. ఆ ఒక్క కవితతో తెలుగు సాహిత్య ప్రపంచంలోకి ఐదు పదుల వయసులో తిరిగి వెళ్లని సైబీరియన్ పక్షిలా వచ్చారు ముకుంద రామారావు. కవి అనండి, రచయిత కానివ్వండి, ఏ కళాకారుడైనా తనని తాను ప్రేమించకుండా, మోహించకుండా, వ్యామించకుండా ఏ సృజనైనా చేయలేరు. తాను సృష్టించిన ప్రతి వాక్యం తనది కాకుండా ఎలా ఉంటుంది. చివరికి ఎవరినో ప్రేమిస్తున్నానుకుంటూ రాసే కవిత్వం కూడా ఆ కవో, కవయిత్రో తనను

చక్రవాకం

\- ముక్కాము చక్రధర్

తాను ప్రేమిస్తున్నట్లుగానే చెప్పుకుంటారేమో. ఈ ఎరుకు ముకుంద రామారావులో చాలా ఉంది. అందుకే ఆయన కవిత్వంలో మనమే కాదు ఆయనా ఉంటారు. ఇది చూడండి...

"ఎవరిని ప్రేమిస్తున్నానో అది నేనే.. నేను ప్రేమిస్తున్నది నన్నే
ఒకే శరీరంలో అవతరించిన రెండు ప్రాణాలు
నువ్వు నన్ను చూస్తే... నువ్వు అతన్ని చూస్తావు
నువ్వు అతన్ని చూస్తే... నన్ను చూస్తావు"

బహుశా మానవుల పట్ల అవ్యాజమైన ప్రేమ, తీసుకోవడంలోనూ., ఇవ్వడంలోనూ కూడా లేకపోతే ఇంత సున్నితమైన కవిత్వం రాదు.

"నువ్వు వెళ్లిపోయినా నాలోనే ఉన్నావు...
"ఎడబాటులో ఎడబాటు నన్నొదిలింది...
నేను అవ్యక్తాన్ని చూడగలిగాను.."

ఇదీ మనిషిలోని మనిషితనాన్ని చూడడమంటే. ఇంత మంచి కవిత్వం రాసిన ముకుంద రామారావుని చూసిన వారికి ఓ కవిత్వ సంకలం చక్కని ప్యాంటు, షర్టు తొడుక్కుని మనకు ఎదురైనట్టుగా ఉంటుంది. నాకే కాదు... తెలుగు సాహిత్యంలో చాలా మందికి ముకుంద రామారావు ఇష్ట కవి. పంచభూతాలను కాంచిన వారే అంతా. ఆ పంచభూతాలను కాంచడమే కాదు కవిత్వీకరించారు కూడా. "అదే నేల, అదే గాలి, అదే నీరు, అదే ఆకాశం, అదే కాంతి" పేరుతో వచ్చిన ఈ కవిత్వం మనం రోజువారీ జీవితంలో చూసినవే. కానీ ఈ కవికి కొత్తగా ఎలా కనిపించాయో తెలియాలంటే ఈ కవిత్వం చదవాల్సిందే. తెలుగు సాహిత్య ప్రపంచంలో నిలబడాలంటే నీదంటూ ఓ సంతకం ఉండాలి. త్రిపురనేని శ్రీనివాస్ అంటాడూ..."సంతకం ఎప్పుడు ఒకేలా చేయలేను" అని. అవును. ముఖ్యంగా కవులు తమ సంతకాన్ని నిరంతరం మార్చుకోకపోతే నిలబడలేరు. ఫ్యాక్టరీల్లోంచి వస్తున్న నల్లటి మేఘంలా కవిత్వం పుంఖానుపుంఖాలుగా వస్తున్న నేటి కాలంలో నీదైన సంతకం ఉండాలి. అది నిరంతరం మారుతూ ఉండాలి. అలా తనదైన సంతకంతో కవిత్వ ప్రయాణం ప్రారంభించి తన అధ్యయనంతో ఆ సంతకాన్ని మార్చుకుంటూ నిలబడుతున్న అతి తక్కువ మంది తెలుగు కవుల్లో ముకుంద రామారావు ముఖ్యులు. ఏ వయసులో ముచ్చట ఆ వయసులో తీర్చుకోవాలి అనేది మా అమ్మ. బహుశా ముకుందా రామారావు తల్లి కూడా అదే మాట చెప్పి ఉంటారు. అందుకే ఆయన పదవీ విరమణ అనంతరం సూఫీ కవిత్వ లోతులు చూడడం ప్రారంభించారు. నచ్చి ఉంటుంది. కొన్ని నచ్చకపోయీ ఉంటాయి. ఇలా నచ్చిన వాటిని అనువదించే పని పెట్టుకున్నారు. అలా అనువదించిన వాటిని పూలమాలగా కూర్చి శతాబ్దాల సూఫీ కవిత్వం అంటూ ఓ సంకలనం తీసుకువచ్చారు. ఈ సంకలనంలో కవిత్వమంతా తెలుగు కవిత్వ ప్రియులకు కొత్త అనుభూతిని మిగిల్చింది. ఇది చాలు కదా ఏ కవిత్వ పాఠకుడికైనా. ఇలాగే నోబెల్ బహుమతులు వచ్చిన గొప్ప కవుల కవిత్వాన్ని కూడా తెలుగులో తీసుకువచ్చారు. ఇంతకు ముందు కవిత్వం కాదు కానీ అలా నోబెల్ పురస్కారాన్ని పొందిన వారి గురించి సదాశివరావు వ్యాసాలు రాసేవారు. ఆ బొన్నసా... ఆ కవి గురించిన పరిచయాలు మినహా కవిత్వం గురించి పెద్దగా తెలిసేది కాదు. ఆ పనిని ముకుంద రామారావు చేశారు. "ఇదిగో వీమ్మల్లో వీళ్లకి నోబెల్ బహుమతి ఊరికే రాలేదు. ఇంత అద్భుతమైన కవిత్వం రాశారు కాబట్టే వచ్చింది" అని చెప్పారు. అన్నట్లు ఈ మోహమాటపు, సిగ్గరి, స్పష్టమైన నవ్వుకి అనువాదాల ముకుంద రామారావు గురించి ఇంత చెప్పాలని ఎందుకంటే తెలుగులో ప్రతిష్టాత్మకమైన అవ్. విజో పురస్కారం ఇస్తున్నారు కాబట్టి. ఈ ఫౌండేషన్ వారికి ప్రతి ఏటా మంచి మల్లెలు ఎలా దొరుకుతాయో... మాల కట్టేందుకు అని నాకో సందేహం. అవును, వీరిచ్చే పురస్కారాలు పొందిన వారంతా వెన్నెల్లో మల్లెల్లాంటి వారే. అలాంటి వారి మల్లె పందిరే అవ్. విజో ఫౌండేషన్.

సీనియర్ జర్నలిస్ట్,
ఫోన్: 9912019929

శ్రీరాముడు-నరేంద్ర మోదీ-ఎన్నికలు

మక్కెన సుబ్బారావు

నాలుగునెలల్లో సార్వత్రిక ఎన్నికలు. మూడవసారి మోదీ-ఈ పర్యాయం 400 సీట్లు. జనవరి 22న అయోధ్యలో రామజన్మభూమిగా విశ్వాసముంచిన ప్రదేశంలో కొత్తగా నిర్మించిన భవనమైన రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట, ఆహుతుల సమక్షంలో ఆలయానికి భారత ప్రధాని నరేంద్రమోదీ దివ్యహస్తాలతో ప్రారంభోత్సవం. రాజ్యం కార్యకలాపాల నుంచి మతాన్ని దూరంగా పెట్టిన భారత లౌకిక రాజ్యాంగానికి ఇది ఉల్లంఘన కాదా! భారత ప్రజలు తమకు తాము సమర్పించుకున్న 'సర్వసత్తాక సోషలిస్టు సెక్యులర్, ప్రజాస్వామిక రిపబ్లిక్' రాజ్యాంగంపై ప్రమాణంచేసి ఏలుబడి సాగిస్తున్న నరేంద్రమోదీ రామాలయం ప్రారంభోత్సవమనే ఈ హైందవ మత మహాక్రతువుకు ముఖ్య అతిథి. మతం వ్యక్తిగతం. ఇష్టమొచ్చిన మతావలంబనకు రాజ్యాంగం స్వేచ్ఛ ఇచ్చింది. నరేంద్రమోదీ ఒక వ్యక్తి కాదు, ప్రధానమంత్రి అనే ఒక అత్యున్నతాధికార వ్యవస్థకు ప్రతినిధి. భారతదేశం ఏకజాతి, ఏకమతం దేశం కాదు. పుట్టుకతోనే హిందువులుగా పరిగణించే వారిలోనే ఎన్నో మతాలు, శాఖలతోపాటు భౌతికవాదులు, నాస్తికులు సైతం ఉన్నారు. ఈనాడు భారతదేశంగా పరిగణిస్తున్న భూభాగాన్ని మహమ్మదీయ చక్రవర్తులు, క్రైస్తవ వలస పాలకులు అనేక వందల సంవత్సరాలు పరిపాలించినందున ఆ మతాలను స్వీకరించిన, ఆచరిస్తున్న జనాభా పెద్దసంఖ్యలోనే ఉన్నారు. హిందువే అయినప్పటికీ కోట్లాది దళితులకు, గిరిజనులకు ఆలయ ప్రవేశమే నిషిద్ధం. ఎన్నో నిరంకుశ చట్టాలు అమలుచేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ఆ నిషేధాన్ని తీవ్రమైన అమానుషనేరంగా పరిగణిస్తూ ఒక చట్టాన్ని ఎందుకు తేలేదు? ఆయన వెనుకబడిన తరగతి సామాజిక వర్గానికి చెందినవారైనప్పటికీ సనాతన ధర్మానికి నిబద్ధుడైన వ్యక్తి.

అత్యధిక మత ధర్మాలను ప్రజలు విశ్వసించి ఆచరించేటట్లు చేయటానికి పూర్వులు సృష్టించినవే పురాణాలు. మహాకవి వాల్మీకి 'తులసీ రామాయణం' పేరుతో రచించిన శ్రీరామగాథ వాస్తవం కావచ్చు, కాకపోవచ్చు. సమాజాన్ని సన్మార్గంలో పెట్టడానికి శ్రీరామచంద్రుణ్ణి పురుషోత్తమునిగా, ఆదర్శ పురుషునిగా, జగదభిరాముడిగా సృష్టించారు. రామనామం వేల సంవత్సరాలుగా గ్రామగ్రామానికీ వ్యాప్తి చెందింది. మానవునిగా జన్మించిన రాముడు భగవంతుడి స్థానం పొందాడు. రామగాథ చెప్పని, చూడని కళారూపము, గుడిలేని వాడలేదు, శ్రీరామ పట్టాభిషేక పటంలేని హిందూ ఇల్లు ఉండదు. రాముణ్ణి సర్వులకూ ఏటా గుర్తుచేసే శ్రీరామనవమి ఉత్సవాలు ఉండనే ఉన్నాయి. ఇంతగా ప్రాచుర్యంలో ఉండే రామచంద్రునికి ఇప్పుడీ వైభవోపేత రాజకీయ సమ్మిళిత మహోత్సవం ఎందుకు అవసరమైంది?

రామజన్మభూమి వివాదం

బాబ్రీ మసీదు-రామజన్మభూమి వివాదం కేసు సూక్ష్మంగా ఇలా ఉంది. బాబర్ సైన్యాధిపతి మీర్‌బకీ 1529 సంవత్సరంలో బాబ్రీమసీదు నిర్మించాడు. 1885లో కోర్టు వివాదం చేశాడు. ఫైజాబాద్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ అనుమతి నిరాకరించాడు. రఘుబీర్‌దాస్ ఇండియాకు బ్రిటిష్ కార్యదర్శికి వ్యతిరేకంగా ఫైజాబాద్ కోర్టులో టైటిల్ సూట్ (భూమిపై హక్కు దావా) దాఖలు చేశాడు. కోర్టు

ఆ అభ్యర్థనను తిరస్కరించింది. 1949 డిసెంబరు అర్థరాత్రి ఒక వ్యక్తి రామలక్ష్మణుల విగ్రహాలు రహస్యంగా తీసుకెళ్లి బాబ్రీ మసీదు మధ్య డోము కింది భాగంలో పెట్టాడు. భగవానుడు వెలిశాడంటూ హిందువులు పూజలు చేయసాగారు. ప్రభుత్వం దాన్ని "వివాదప్రాంతంగా" ప్రకటించి ప్రవేశద్వారానికి తాళాలు వేయించింది. అది రామజన్మభూమి అంటూ ఆ లల్లాలో పూజలకు అనుమతి కోరుతూ, గోపాల సింగ్ విశారద్, పరమహంస రామచంద్ర దాస్ అనే ఇరువురు హిందువులు 1950లో రెండు కేసులు దాఖలుచేయగా, 1959లో నిర్మోహి అఖారా మూడవ హిందూసూటు దాఖలు చేశారు. కాగా యూపీ సున్నీ వక్ఫ్‌బోర్డు బాబ్రీమసీదు నుంచి విగ్రహాలు తొలగించాలని, మసీదు స్థలాన్ని తమకు అప్పగించాలని కోరుతూ 1961లో కేసు దాఖలు చేసింది. 1984లో విశ్వహిందూ పరిషత్ రామజన్మభూమి ఉద్యమంకోసం ఒక కమిటీ ఏర్పాటుచేసింది. ఆ ప్రచారోద్యమానికి బీజేపీ నేత ఎల్‌కె అద్వాణీ నాయకుడు. 1986 ఫిబ్రవరిలో జిల్లా జడ్జి ఆదేశాలపై గేట్లు తాళాలు తీశారు. హిందువులు పూజలు చేయసాగారు. 1989 నవంబరు 9న వివాదప్రదేశం సమీపంలో వీహెచ్‌పీ శిలాన్యస్ (భూమిపూజ) నిర్వహించేందుకు ప్రధాని రాజీవ్‌గాంధీ అనుమతించారు. నిరసనగా ముస్లింలు బాబ్రీమసీదు యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. 1989లో భూమిపై హక్కు కేసులన్నీ అలహాబాద్ హైకోర్టుకు బదిలీఅయ్యాయి. 1989 ఎన్నికల్లో రాజీవ్‌గాంధీ అయోధ్యలోని శిలాన్యాస్ ప్రదేశంనుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. రామరాజ్యం స్థాపిస్తామన్నారు. కాని ఓడిపోయారు. అటు తర్వాత విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ప్రభుత్వం వెనకబడిన తరగతులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తూ మండల్ కమిషన్ నివేదికను అమలు జరపటంతో అగ్రవర్ణాలు విలవిలలాడిపోయాయి. అప్పుడు బీజేపీ రామజన్మభూమి సమస్యను తమ ఎజెండాలోకి తీసుకుంది. 1990 సెప్టెంబరు 25న ఎల్‌కె అద్వాణీ రామజన్మభూమి ఉద్యమానికి మద్దతుగా సోమనాథ్(గుజరాత్) నుంచి అయోధ్యకు రథయాత్ర ప్రారంభించారు. 2010 సెప్టెంబరు 10న హైకోర్టు లక్నో బెంచి అయోధ్య వివాదప్రదేశాన్ని 2:1 దామాషాలో ముస్లింలు, హిందూ కక్షిదారులకు పంచింది.సుప్రీంకోర్టు 2011 మే నెలలో అలహాబాద్ హైకోర్టు తీర్పును నిలుపుదలలో పెట్టింది. ప్రధాన న్యాయమూర్తి ఖెహార్ 2017 మార్చి 21న కక్షిదారులు కోర్టు వెలుపల పరిష్కారం కుదర్చుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం 2017 ఆగస్టు 11న విచారణ ప్రారంభించింది. 2019 జనవరి 8న సీజెఐ రంజన్‌గొగోయి ఐదుగురు జడ్జీల బెంచి ఏర్పాటుచేశారు. 2019 మార్చి 8న కోర్టు పర్యవేక్షణలో మధ్యవర్తిత్వం ఆదేశించింది. ఈ బెంచి టైటిల్ వివాదం పరిష్కారం బదులు విశ్వాసాన్ని గౌరవిస్తూ 'భగవాన్ రామ్ ఆ ప్రదేశంలో జన్మించాడన్న" హిందువుల విశ్వాసం వివాదంలేనిది. అందువల్ల సంకేతప్రాయంగా ఆ భూమిపై స్వామ్యం ఆయనదేనని "కోర్టుతీర్పుగా" ధర్మాసనం 2019 నవంబరు 9న ఏకగ్రీవంగా చెప్పింది. రామమందిర్ నిర్మాణానికి మూడునెలలలోపు ఒక ట్రస్టు ఏర్పాటు చేయాలని, ట్రస్టీల బోర్డు ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ముస్లింలకు ప్రత్యామ్నాయంగా వేరే ప్రదేశంలో 5 ఎకరాల స్థలం మంజూరు చేసింది. భారతదేశ చరిత్రలో అతి సుదీర్ఘమైన వివాదం పరిసమాప్తం అయింది. దేశం ఊపిరి పీల్చుకుంది. ఈ తీర్పును సుసాధ్యం చేసిన రంజన్ గొగోయి కొద్దికాలంలోనే రాజ్యసభకు నామినేట్ అయ్యారు.

వర్తమానం-మహోత్సవం

వర్తమానంలోకి వస్తే అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్నది. రామచరిత్ర ఉట్టిపడుతున్న రైల్వేస్టేషన్, విమానాశ్రయాలను ప్రధానమంత్రి మోదీ గత నెల 30న ప్రారంభించారు. అయితే బీజేపీ చేస్తున్న హడావుడి ఇది ఆధ్యాత్మిక కార్యక్రమమా లేక కాషాయమార్క్ రాజకీయ కార్యక్రమమా అనే సందేహం కలిగించక మానదు. ప్రధానమంత్రి డిసెంబరు 30న అయోధ్య నుంచి దేశప్రజలకిచ్చిన పిలుపు చూడండి. "ఆలయ ప్రాణ ప్రతిష్టరోజు భారతీయులు శ్రీరామజ్యోతి వెలిగించాలి. దీపావళి లాగా జరుపుకోవాలి. ఈ చారిత్రక గడియ అదృష్టవశాత్తు మనందరి జీవితాల్లోకి వచ్చింది. జనవరి 14 నుంచి 22వరకు ఆలయాలు, యాత్రాస్థలాలను శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టండి. భగవాన్ రాముడు అరుదెంచుతున్నప్పుడు చుట్టుపక్కల చెత్తాచెదారం ఉండరాదు". బాలరాముని విగ్రహ ప్రతిష్టను దేశం నలుమూలలకు తీసుకెళ్లే వ్యూహాలపై చర్చించేందుకు బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా మంగళవారం సమావేశం జరిపారు. 22వ తేదీకి ముందు, అన్ని జిల్లాల్లో ఆలయాలను శుభ్రపరచడం, ఆ తర్వాత యాత్రికులను అయోధ్య పంపడంకోసం 400పట్టణాల నుంచి రైళ్లు ఏర్పాటుచేసే కార్యక్రమాలు చేపడతారు. పార్టీని ట్రావెల్ ఏజన్సీగా మారుస్తారన్నమాట! ఇదంతా ఎందుకు? మే-జూన్‌లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు కొల్లగొట్టే సాధనంగా అయోధ్య రామాలయ కార్యక్రమం చేపడుతున్నారు. ఒక ఐచ్ఛిక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని రాజకీయ స్వప్రయోజనానికి ఉపయోగించుకుంటున్నారు. తాము ఈ పదేళ్ల అధికారకాలంలో చేసిన రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజావ్యతిరేక చర్యలన్నిటినీ ప్రజలు మరచిపోయి రాముడిలో మోదీ ముఖం చూసి తమ పార్టీకి మళ్లీ పట్టం కట్టాలని ఆశిస్తున్నారు. ప్రజాతంత్రశక్తులు అప్రమత్తంగా ఉండాలి, ప్రజలను చైతన్యపరచాలి. మతం వేరు, రాజకీయం వేరు! లౌకికతను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం!

సీనియర్ జర్నలిస్టు
ఫోన్: 9390683756

పదేళ్లలో మితిమీరిన బ్యాంకు మోసాలు

డా. జ్ఞాన్‌పాఠక్

తాను అధికారంలోకి వస్తే అవినీతిలేని దేశంగా రూపొందిస్తానని 2013-14లో ప్రధాని నరేంద్రమోదీ చేసిన వాగ్దానం పూర్తిగా ఉల్లంఘించారు. 2013-14లో బ్యాంకుల మోసాలు 4306 జరగగా, 2022-23లో మోసాలు అపారంగా 13,576 కు పెరిగాయి. గత సంవత్సరం ఆరు నెలల్లోనే యూపీఏ ప్రభుత్వంలో జరిగిన బ్యాంకుల్లో మోసాలు మితిమీరి 8,14,483 కేసులు జరిగాయి. అవినీతిని నిర్మూలించకపోగా ఆది మరింత పెంచిన మోదీని ఓటర్లు నిర్లక్ష్యంచేసి మళ్లీ గెలిపిస్తే అన్ని వాగ్దానాలను ఉల్లంఘించి నిరంకుశ ధోరణిని మరింతగా పెంచుతారు. గతంలో ఏనాడులేని విధంగా రిజర్వుబ్యాంకు 2022-23లో ధోరణిని, పురోగతిని గత డిసెంబరు 27న ప్రకటించింది. 2020-21 నాటికి ముందు 9,621కేసులు (రూ.17,1985 కోట్లు) నమోదయ్యాయి. 2020-21లో మాత్రమే 5,590 కేసులు నమోదుకాగా, అవి 2020-21లో 7,659కి 2022-23 నాటికి 13,576కు పెరిగాయి. 2022-23లో మొత్తం రూ.11,828 కోట్లు అయ్యాయి. అంతక్రితం రెండు సంవత్సరాలు వరుసగా రూ.6,953, రూ.2,146 కోట్లు అయ్యాయి. 2020-21లో 7,263 కేసులు, 2021-22లో 9,053, 2022-23 నాటికి 13,576 కేసులు, వరుసగా మొత్తాలు రూ.118,417 కోట్లు, రూ.45,598 కోట్లు, రూ.26,632 కోట్లు. బ్యాంకులో అవినీతి కేసులను పూర్తిగా అరికడతానని వాగ్దానం చేసినప్పటికీ, అవినీతి కేసులు పెరుగుతూనే ఉన్నాయి. బ్యాంకుల నుంచి కొల్లగొట్టిన మొత్తాలు 2011-12లో రూ.4497 కోట్లు, 2015-16 నాటికి రూ.18,491 కోట్లకు, 2019-20కి ముందు రూ.166,576 కోట్లు, 2020-21కి ముందు రూ.171,985 కోట్లు అయింది. ఏనాడు ఎరుగనన్ని మోసాలు, మొత్తాలు మోదీ పాలనలోనే జరిగాయి. మోదీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. గత రెండు దశాబ్దాలకాలంలో బ్యాంకింగ్ రంగం తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించకపోయినా వాటిని ప్రభుత్వ అనుమతితో రిజర్వుబ్యాంకు రద్దు చేస్తుంది. బకాయిలు చెల్లించకుండా విదేశాలకు పారిపోవడానికి రిజర్వు బ్యాంక్, ప్రభుత్వం కారణంకాదా? తాను అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో ఎక్కువ మోసాలు జరిగినప్పటికీ ఇండియాకూటమి పార్టీలే బాధ్యులని నిందిస్తున్న మోదీని ఏమనుకోవాలి? మోసాలు ఏనాడు లేనంతగా పెరిగిపోతున్నప్పటికీ, వాటిని పెరగకుండా మోదీ ఏ మాత్రం నియంత్రించడానికి కఠినమైన చర్యలు తీసుకున్నట్లు ఏమాత్రం సూచనలేవు. అయితే రిజర్వుబ్యాంకు ప్రకటించిన ప్రకారం, గత ఆరేళ్లలో క్రమంగా మోసాలు తగ్గుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరాలకాలంలో అంతక్రితం సంవత్సరంలో 14.9శాతం మొత్తాలు పెరిగాయి. ఇంటర్నెట్ ద్వారా 2022-23 (ఏప్రిల్-సెప్టెంబరు) రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని కేసులే ఎక్కువున్నాయి. ఇలాంటివి 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉన్నాయి.

తీరప్రాంత భూ పోరాటయోధుడు సాంబమూర్తి

మల్లుల సీతారాం ప్రసాద్

కార్య దీక్షాపరుడు, తీర ప్రాంత భూపోరాట యోధుడు నాగిడి సాంబమూర్తి. భారత కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం, ఆయన పేరు వింటేనే ఆ రోజుల్లో భూస్వాముల గుండెల్లో హడల్. సుమారు నాలుగువేల ఎకరాల బంజరు భూములను ఆక్రమించి తీరప్రాంత ప్రజానీకానికి పంపిణీచేయడంలో ఆయన చేసిన కృషి అనిర్వచనీయం. నిరుపేద మత్స్యకార కుటుంబంలో జన్మించిన ఆయన 1947 సంవత్సరంలో జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. అప్పటికే సాధువుగా ఆయన ఈ ప్రాంతం అంతటికి పరిచితులు. 1948లో కమ్యూనిస్టులకు ఆశ్రయం కల్పించి తదుపరి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కమ్యూనిస్టులకు ఆశ్రయం కల్పించారనే నెపంతో ఆయన్ని పోలీసులు అరెస్టు చేసి మచిలీపట్నం జైలుకు తరలించి చిత్రహింసలకు గురి చేశారు. 1959లో ది నాగిడి పాలెం ఫిషర్ మాన్‌ఫీల్డ్ లేబర్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీని స్థాపించారు. ఈ సొసైటీకి దీర్ఘకాలం అధ్యక్షులుగా ఉన్నారు. ఈ సొసైటీ ద్వారా వేలాది అటవీ బంజరు భూమిని సీపీఐ నాయకత్వంలో ఆక్రమించి డిఫారెస్టు చేయించి ఈ ప్రాంత ప్రజానీకానికి పంచారు. సాంబమూర్తి ఉద్యమానికి నాటి సీపీఐ శాసనసభ్యులు వంక సత్యనారాయణ పూర్తి సహకారం అందించారు. ఈ బంజరు పోరాటం ద్వారా నాగిడిపాలెం, బర్రివానిపేట, దొంగపిండి, కొత్తపూలమర్రు, నాగేంద్రపురం, తోకతిప్ప మోడీ, కలువపూడి, బొండాడలంక, అనాకోడేరు, చల్లపల్లి గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరింది. ఇదేవిధంగా గొల్లవానితిప్ప గ్రామంలో ఉన్న సీపీడీ భూమిని పేదలకు పంచాలని పెద్ద ఉద్యమమే నిర్వహించారు. 1970 ప్రాంతంలో కాళీపట్నం జమీందారుతో పోరాడి ఆనాటి శాసనమండలి సభ్యులు, రైతు సంఘం నాయకులు వైవీ కృష్ణారావు సహాయంతో కాళీపట్నం మెయిన్ కాలువ నుంచి నాగిడిపాలెం వరకు పంట కాలువ ఏర్పాటు చేయించారు. ఈ ప్రాంతంలో కోస్తా కారిడార్ అభివృద్ధి కావాలనే ధ్యేయంతో సముద్ర ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు



తరలించాలంటే కోస్తా కారిడార్ అవసరమని చాలా కాలం క్రితమే ఒక రూట్ మ్యాప్‌ను తయారు చేసి ప్రభుత్వానికి అందించారు. ఆయన కృషి మూలంగా నాగిడిపాలెం లోసరి బ్రిడ్జిలు నిర్మాణమయ్యాయి. పాతపాడు, లక్ష్మీపురం వద్ద స్ట్రెట్ కట్ నిర్మాణం చేయించడానికి, అదే సమయంలో వచ్చిన వరదలు మూలంగా ఈ ప్రాంత ప్రజలను పరామర్శించడానికి నాటి ప్రధాని, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజీవ్ గాంధీని, నాటి సీపీఐ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరావుని, ఆనాటి భీమవరం శాసనసభ్యులు సుభాష్ చంద్రబోస్‌ని బోటుల ద్వారా తీసుకువచ్చారు. 1968లో కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి ప్రధాన వ్యాపార కేంద్రమైన పాతపాడు ఎండు చేపల మార్కెట్ అభివృద్ధికి షెడ్లు నిర్మాణం చేయించారు. ఆనాటి సీపీఐ శాసనమండలి సభ్యులు కోండ్రు సుబ్బారావు నాయకత్వంలో షెడ్లు నిర్మించే వరకు పనులు చెల్లించరాదని నిరాకరణ ఉద్యమం కూడా చేశారు. నాగిడిపాలెం గ్రామ సర్పంచ్‌గా రెండు దఫాలు ప్రజలకు సేవలు అందించారు. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కోసం విశేషంగా కృషిచేశారు. సాగునీరు తాగునీరు, విద్య, వైద్యం రోడ్లు వంతెనలు, నాగిడిపాలెం వద్ద మందచేడుపై సెంట్రస్ ఏర్పాటు చేయించారు. 1978వ సంవత్సరంలో నాగిడి సాంబమూర్తి చేస్తున్న ఉద్యమాలకు, పోరాటాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆయనపై దాడులకు ప్రయత్నించారు. కొలతలకని పిలిచి భూస్వాములు ఆయనపై భౌతిక దాడికి దిగి హత్యాయత్నం చేశారు. ఆయన మనోధైర్యంతో చిన్ననాడు నేర్చుకున్న యోగ విద్య ద్వారా కోలుకున్నారు. భూ పోరాటాలకు సాంబమూర్తి ఊపిరి లాంటివాడు. ఆయన తీర ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం ప్రాణాలను సైతం అర్పించడానికి వెనుకాడలేదు. తూర్పు, పశ్చిమ కృష్ణా జిల్లాలకు చెందిన ఆనాటి రెవెన్యూ జీవోలు ఆయా కార్యాలయాల కంటే ముందుగా సాంబమూర్తికి చేరేవి. ఆయన ఇల్లు ఒక రెవెన్యూ కార్యాలయంలా ఉండేది. పెద్ద పెద్ద అధికారులు సైతం ఆయనను అడిగి ఆ జీవోలు తీసుకునేవారు. తీర ప్రాంత ప్రజలను కమ్యూనిస్టు పార్టీ వైపు మళ్లించడంలో, ప్రజా సంఘాల ద్వారా ఉద్యమాలు చేయించడంలో ఆయన కృషి వెలకట్టలేనిది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ హైదరాబాద్, ఢిల్లీలో ఈ ప్రాంతపు పనులు చేయించడానికి తనదైన శైలిలో అడ్డంకులను అధిగమించి పనులు పూర్తి చేసేవారు. సాంబమూర్తి పోరాటశైలి ఈ ప్రాంతానికే కాదు జిల్లా, రాష్ట్ర ప్రజానికానికే ఆదర్శం. నేటి యువత సాంబమూర్తి పోరాట స్ఫూర్తిని, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి. వృద్ధాప్యంతో 2003 డిసెంబరు 17న సాంబమూర్తి కన్నుమూశారు.

(శనివారం నాగిడి పాలెం గ్రామంలో నాగిడి సాంబమూర్తి కాంస్య విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా)
సీపీఐ భీమవరం రూరల్ మండలం కార్యదర్శి

ఈడీ అధికారులపై దాడి

- బెంగాల్‌లో తృణమూల్ అరాచకం
- అధికారులు, మీడియా ప్రతినిధులకు గాయాలు
- వాహనాలు ధ్వంసం
- జవాన్లను తరిమికొట్టిన వైనం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో శుక్రవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈడీ అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. రేషన్ కుంభకోణానికి సంబంధించి సందేశ్‌ఖాలీలోని సర్బేరియా సహా 18 చోట్ల ఈడీ దాడులు నిర్వహించింది. ఈ కేసులో అరెస్టయిన రాష్ట్రమంత్రి మల్లిక్ సన్నిహితుడు, తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్ షేక్ నివాసంపై దాడులు నిర్వహించేందుకు వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల బృందంపై ఆయన మద్దతుదారులు 100 మందికి పైగా దాడికి పాల్పడ్డారు. వెంబడించి... వెంటాడారు. అధికారులు ప్రాణభయంతో పారిపోయారు. పశ్చిమ బెంగాల్‌లో రేషన్ పంపిణీ కుంభకోణానికి సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ప్రస్తుతం విచారణ జరుపుతున్న నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టింది. రాష్ట్రంలో లబ్ధిదారుల కోసం ఉద్దేశించిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రేషన్‌లో దాదాపు 30 శాతం బహిరంగ మార్కెట్‌కు మళ్లించారని ఈడీ గతంలోనే వెల్లడించింది. కోట్లాది రూపాయల రేషన్ పంపిణీ కుంభకోణంలో అరెస్టయిన రాష్ట్ర మంత్రి జ్యోతిప్రియో మల్లిక్‌కు షాజహాన్ అత్యంత సన్నిహితుడు. తృణమూల్ నాయకుడి అనుచరులు ఈ దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈడీ అధికారుల బృందంతో పాటు కేంద్ర సాయుధ దళాల సిబ్బంది, దాడి దృశ్యాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపైనా దాడి జరిగింది. అధికారుల కాన్వాయ్‌లోని వాహనాలను, న్యూస్ టీవీ కెమెరాలు, ప్రసార పరికరాలను ధ్వంసం చేశారు. ఈ దాడిలో అనేక మంది జర్నలిస్టులు, సహాయక సిబ్బంది గాయపడ్డారు. దుండగుల గుంపు చేసిన దాడిలో ఈడీ అధికారి ఒకరికి తలకు గాయాలై రక్తస్రావమైంది. వారి వాహనాలు తీవ్రంగా ధ్వంసమవడంతో అక్కడి నుంచి ఆటో రిక్షాలో పారిపోవలసి వచ్చింది. గాయపడిన ఈడీ అధికారులను కలకత్తా ఆస్పత్రిలో చేర్చారు. శుక్రవారం తెల్లవారుజామున రెండు ఈడీ బృందాలు రేషన్ పంపిణీ కుంభకోణానికి సంబంధించి జైలు శిక్ష అనుభవిస్తున్న తృణమూల్ మంత్రి జ్యోతిప్రియ మల్లిక్‌కు సన్నిహితులైన తృణమూల్ నాయకులు శంకర్ అద్యా, షాజహాన్ షేక్‌ల ఇళ్లపై దాడి చేశారు. శంకర్ అద్యా అత్తమామల నివాసాల్లోనూ సోదా చేశారు. ఈడీ అధికారుల బృందం ఉదయం 8 గంటలకు షాజహాన్ నివాసానికి చేరుకుంది. అతని ఇంటికి తాళం వేసి ఉండటంతో సీఆర్‌పీఎఫ్ జవాన్ల సమక్షంలో తలుపులు పగలగొట్టేందుకు అధికారులు ప్రయత్నించారు. వెంటనే మహిళలు సహా స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. సోదాలు చేయడానికి ప్రయత్నించినప్పుడు టీఎంసీ మద్దతుదారులుగా భావిస్తున్న 200 మందికి పైగా స్థానికులు ఈడీ అధికారుల బృందంతో పాటు కేంద్ర సాయుధ బలగాలను చుట్టుముట్టారు. అధికారులను అడ్డుకున్నారు. గంట తర్వాత తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించిన అధికారులపై స్థానికులు దాడి చేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. తుపాకీలు, మారణాయుధాలతో స్థానికులు రెచ్చిపోయారు. ఈడీ, మీడియా వాహనాలు రాకుండా ప్రవేశమార్గాల్లో చెక్క దుంగలు వేసి టైర్లకు నిప్పు పెట్టారు. ఈ తరహా దాడి ఊహించలేదని, షేక్ షాజహాన్‌పై నివేదికను దిల్లీలోని ఈడీ కార్యాలయానికి పంపామని ఈడీ అధికారి ఒకరు పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు.

శాంతిభద్రతలు దెబ్బతిన్నాయి: బీజేపీ

'ఈ దాడి భయంకరమైనది. పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయి. షేక్ షాజహాన్ ఇంటిలో సోదాలు నిర్వహించేందుకు వెళ్లిన ఈడీ అధికారులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లపై తృణమూల్ మద్దతుదారులు క్రూరంగా దాడి చేశారు. దేశ వ్యతిరేక విధ్వంసకారుల్లో రోహింగ్యాలు ఉన్నారని నేను అనుమానిస్తున్నాను' అని బీజేపీ నాయకుడు సువేందు అధికారి 'ఎక్స్' (ట్విట్టర్)లో ఆరోపించారు. 'కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బెంగాల్ గవర్నర్, ఈడీ, సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్లు ఈ అరాచకాన్ని అణిచివేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నేను కోరుతున్నాను. ఎన్‌ఐఏతో విచారణ జరిపించాలి' అని సువేందు అధికారి డిమాండ్ చేశారు. కాగా, బెంగాల్‌లో జరుగుతున్న పరిస్థితులను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నితీశ్ ప్రమాణిక్ తెలిపారు. 'కోర్టు సూచనల మేరకు పనిచేసే కేంద్ర దర్యాప్తు సంస్థ ఏదైనా ప్రదేశంలో విచారణకు వెళ్లినప్పుడు అధికారుల బృందాలకు భద్రత కల్పించడం రాష్ట్ర బాధ్యతన్నారు. బెంగాల్‌లో దర్యాప్తు బృందాలపై దాడులు జరగడం చాలాసార్లు చూశామన్నారు. ఇది కేవలం కేంద్ర దర్యాప్తు బృందంపై దాడి కాదని, దేశ సమాఖ్య నిర్మాణంపైనే దాడని వ్యాఖ్యానించారు. మరోవైపు, 'సందేశ్‌ఖలీ ఘటన ఆందోళనకరం, దురదృష్టకరం. తృణమూల్ కాంగ్రెస్‌ను కించపరిచేలా బీజేపీ సూచనల మేరకు కేంద్ర సంస్థలు దాడులు చేసి ప్రజలను రెచ్చగొడుతున్నాయని తృణమూల్ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ అన్నారు.

దాడి ఆందోళనకరం: గవర్నర్

ఈడీ అధికారులపై తృణమూల్ మూకల దాడిని పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సీవీ ఆనంద బోస్ ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో విఫలమైనందుకు రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. రాజ్యాంగం తనకు కల్పించిన అధికారాల ప్రకారం ఈ ఘటనపై చర్యలను పరిశీలిస్తానని గవర్నరు పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యంలో అనాగరికత, విధ్వంసాలను అరికట్టడం నాగరిక ప్రభుత్వ విధి. గవర్నర్‌గా, తగిన పద్ధతిలో తగిన చర్య కోసం నా రాజ్యాంగపరమైన హక్కులన్నింటినీ అన్వేషిస్తాను' రాజ్ భవన్ నుంచి విడుదలైన ఒక సందేశంలో బోస్ అన్నారు.

పవార్ మనవడి సంస్థలో ఈడీ సోదాలు

ముంబై: ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ కుటుంబానికి చెందిన సంస్థలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)సోదాలు నిర్వహించింది. పవార్ మనవడు రోహిత్ పవార్‌కు చెందిన బారామతి ఆగ్రో, అనుబంధ సంస్థల్లో తనిఖీలు జరిగాయి. మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు కుంభకోణంలో మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా బారామతి, పూనె, ఔరంగాబాద్, అమరావతి సహా దాదాపు ఆరు ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగాయి. రోహిత్ పవార్... శరద్ పవార్ సోదరుడి మనవడు. మద్యం కుంభకోణం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ సమస్లు జారీ చేయడంపై శరద్‌పవార్ అభ్యంతరం వ్యక్తంచేశారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి బీజేపీ కుట్ర చేస్తోందని విమర్శించారు. విపక్షాలను అణచివేసేందుకు దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ఆప్ అధినేతను ప్రజలు ఓటేసి ఎన్నుకున్నారన్నారు. ఇప్పటికే ఆప్ నేతలు జైల్లో ఉన్నారని, కేజ్రీవాల్‌ను కూడా అరెస్టు చేసేందుకు చర్యలు ప్రారంభించారని దుయ్యబట్టారు. బీజేపీ హిట్లర్‌లా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పవార్ మనవడి సంస్థలపై ఈడీ దాడులకు దిగినట్లు భావిస్తున్నారు.

85 మందికి కోటికిపైగా వేతనం

ఐఐటీ బాంబే విద్యార్థులకు గొప్ప కొలువులు

ముంబై: దేశంలోనే ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బాంబే విద్యార్థులకు అరుదైన అవకాశం లభించింది. 85 మంది విద్యార్థులు రూ.కోటికి పైగా వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2023-24 నియామకాల సీజన్ మొదటిదశలో భాగంగా ఈ వేతన ప్యాకేజీలు అందుకున్నారు. ఐఐటీ బాంబే నిర్వహించిన నియామక ప్రక్రియలో దేశ, విదేశాలకు చెందిన 388 కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 1340 మంది విద్యార్థులు హాజరుకాగా... 1188 మంది విద్యార్థులు అర్హత సాధించారు. యాక్సెంచర్, ఎయిర్‌బస్, యాపిల్, బార్‌క్లేస్, గూగుల్, జేపీ మోర్గాన్ చేజ్, మైక్రోసాఫ్ట్, టాటా గ్రూప్ వంటి ప్రఖ్యాత సంస్థలు నియామక ప్రక్రియలో పాల్గొన్నాయి. కొన్ని సంస్థలు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించగా... మరికొన్ని సంస్థలు వర్చువల్‌గా పాల్గొన్నాయి. నియామక ప్రక్రియలో ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. జపాన్, తైవాన్, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్, సింగపూర్, హాంకాంగ్ వంటి దేశాల్లో పనిచేసేందుకు 63 మంది ఎంపికయ్యారు. సగటు ప్యాకేజీలు చూస్తే... ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు సగటున రూ.21.88 లక్షలు అందుకున్నారు. ఐటీ/సాఫ్ట్‌వేర్ విద్యార్థులు రూ.26.33 లక్షలు, ఫైనాన్స్ రూ.32.38 లక్షలు, కన్సల్టింగ్ రూ.18.68 లక్షలు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రూ.36.94 లక్షల చొప్పున సగటు వేతనంతో విద్యార్థులు కొలువులు సాధించారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో నోట్ల కట్టలు

ఈడీ సోదాల్లో బయటపడిన తుపాకులు, విదేశీ మద్యం

చండీగఢ్: అక్రమ మైనింగ్ కేసులో హరియాణా నేత దిల్‌బాగ్ సింగ్ ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జరిపిన సోదాల్లో కోట్ల రూపాయల నోట్ల కట్టలు బయటపడ్డాయి. విదేశాల్లో తయారైన తుపాకులు, 100 మద్యం బాటిళ్లు, కేజీల కొద్దీ బంగారం, వెండిని అధికారులు గుర్తించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దిల్‌బాగ్ సింగ్, ఆయన అనుచరులకు చెందిన ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. గురువారం ఉదయం మొదలైన ఈ తనిఖీలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్‌ఎల్‌డీ) నేత దిల్‌బాగ్ సింగ్‌తో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పన్వార్‌పై కూడా ఈడీ దృష్టి సారించింది. మనీలాండరింగ్ చట్టం కింద సోనిపట్, మొహాలీ, ఫరీదాబాద్, చండీగఢ్, కర్నాల్, యమునా నగర్‌లోని 20 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. యమునానగర్ దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మైనింగ్‌పై జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధం విధించిన తర్వాత కూడా ఆ తరహా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వీరిపై ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి ఆ నాయకులపై కేసులు నమోదయ్యాయి. ఈడీ కూడా మనీలాండరింగ్ కింద దర్యాప్తు ప్రారంభించింది. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన పత్రాలను ఈడీ పరిశీలించింది. ఈ దాడుల్లో అనేక కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు వార్తలు వచ్చినప్పటికీ... వాటిపై ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. సింగ్.. యమునానగర్ మాజీ ఎమ్మెల్యే కాగా, పన్వార్ సోనిపట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

తమిళనాడు మంత్రికి సుప్రీంలో ఊరట

న్యూదిల్లీ: మనీలాండరింగ్ కేసుతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్ట్ చేసిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. బాలాజీని మంత్రి పదవి నుంచి తప్పించాలంటూ ఓ సామాజిక కార్యకర్త దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి అనుమతి లేకుండా రాష్ట్ర కేబినెట్ నుంచి తొలగించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. ఏ శాఖ లేని బాలాజీ మంత్రిగా కొనసాగాలా వద్దా అనేది ముఖ్యమంత్రే నిర్ణయిస్తారని తెలిపింది. ఇంతకుముందు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం సమర్థించింది. ఒక మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు ఉందా లేదా అనే విషయాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది. అంతేగానీ సంబంధిత వ్యక్తి మంత్రిగా కొనసాగాలా వద్దా అనే దానిపై నిర్ణయం తీసుకునే బాధ్యతను ముఖ్యమంత్రికి వదిలివేస్తుందని జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. మద్రాస్ హైకోర్టు అభిప్రాయంతో ఏకీభవిస్తున్నామని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది.

మొహల్లా క్లినిక్‌లపై సీబీఐ దర్యాప్తు

న్యూదిల్లీ: కేజ్రీవాల్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆప్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మొహల్లా క్లినిక్‌లలో అవినీతి జరిగిందనే ఆరోపణలపై సీబీఐ దర్యాప్తునకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశించింది. మొహల్లా క్లినిక్‌లలో రోగనిర్ధారణ పరీక్షలకు సంబంధించిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేయాల్సిందిగా సీబీఐని దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మొహల్లా క్లినిక్‌లు రోగులు లేకుండానే నకిలీ రేడియాలజీ, పథాలజీ పరీక్షలు నిర్వహించాయని ఆరోపణలు వచ్చాయి. క్లినిక్‌లకు రాని వైద్యులకు హాజరు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. లేని రోగులకు క్లినిక్‌లలో చికిత్సలు చేసినట్లు బయటపడింది. అంతకుముందు దిల్లీ ప్రభుత్వ ఆసుపత్రులకు నాసిరకం మందులు సరఫరా అవుతున్నాయనే ఆరోపణలపై సీబీఐ దర్యాప్తుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశించారు. మొహల్లా క్లినిక్ ద్వారా దిల్లీలో సామాన్య ప్రజలకు ప్రాథమిక ఆరోగ్యం అందించడానికి ఆప్ సర్కార్ ఏర్పాటు చేసిన పథకం. కేవలం దిల్లీ జనాభాకు మాత్రమే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలకు కూడా ఆరోగ్య సేవలు అందిస్తుంది.

జూదంపై రాష్ట్ర జీఎస్‌టీ చట్టానికి సవరణ

ఆర్డినెన్స్‌పై సంతకం చేసిన కేరళ గవర్నర్

తిరువనంతపురం : రాష్ట్రంలో రాజ్‌భవన్, వామపక్ష ప్రభుత్వం మధ్య వాగ్వాదం కొనసాగుతున్న నేపథ్యంలో జూదానికి సంబంధించి రాష్ట్ర జీఎస్‌టీ చట్టాన్ని సవరిస్తూ కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ శుక్రవారం ఆర్డినెన్స్‌పై సంతకం చేశారు. ఈ విషయాన్ని రాజ్ భవన్ వర్గాలు ధ్రువీకరించాయి. 50వ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్‌టీ) మండలి సమావేశంలో క్యాసినోలు, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌లలో జూదంపై 28 శాతం జీఎస్‌టీని నిర్ణయించి, పందెం ముఖ విలువపై పన్ను విధించాలని నిర్ణయించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను విడుదల చేసింది. ఆ తర్వాత జీఎస్‌టీ చట్టానికి సవరణ చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. దానికి అనుగుణంగానే రాష్ట్ర జీఎస్‌టీ చట్టంలో సవరణలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే తెలిపింది. ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలలో బెట్టింగ్, గుర్రపు పందెం సహా డబ్బు కోసం బెట్టింగ్‌లకు సంబంధించి ప్రస్తుత జీఎస్‌టీ చట్టంలోని కొన్ని అస్పష్టతలను తొలగించే నిబంధనలను ఆర్డినెన్స్ కలిగి ఉందని ప్రభుత్వం ఇంతకుముందు తెలిపింది.

హరియాణా కాంగ్రెస్‌లోకి వలసలు

చండీగఢ్: హరియాణాలోని అనేకమంది మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ రాజకీయ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఐఏఎస్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరంతా బీజేపీ, జేజేపీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, సమాజ్‌వాదీ పార్టీల నాయకులు. ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా నాయకత్వంలోని కాంగ్రెస్‌లో చేరుతున్నామని వీరు ప్రకటించారు. ప్రజానుకూల కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడానికి ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు. జేజేపీ హరియాణా లీగల్ సెల్ అధిపతి సూరజ్ భాన్ కాజల్, హోం శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్ వినయ్ సింగ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ హరియాణా అధ్యక్షుడు బల్బీర్ సింగ్, ఇదివరకు శాసనసభకు పోటీ చేసిన సజ్జన్ సింగ్ ధుల్, మరో ఐఏఎస్ అధికారి వజీర్ సింగ్ గోయత్, హరియాణా రైల్వే విభాగం మాజీ అధికారి కుల్దీప్ అహ్లావత్, ఉద్యోగ విరమణ చేసిన తహసీల్దారు ప్యారేలాల్, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ అధికార ప్రతినిధి రేవారి తోతారామ్, వినోద్ కుమారి చౌహాన్, భూపిందర్ లాంటి ప్రముఖులు తమ అనుయాయులతో పాటు కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికీ స్వాగతం చెప్పిన హుడా ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి సముచిత గౌరవం ఇస్తామని చెప్పారు. హరియాణాలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామన్నారు.

సీట్ల కేటాయింపుపై విభేదాలు లేవు

ముంబై: ఇండియా కూటమిలో సీట్ల కేటాయింపులపై విభేదాలు లేవని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు. మహారాష్ట్రలో ప్రక్రియ సజావుగా సాగుతోందని, మిగిలిన రాష్ట్రాల గురించి త్వరలోనే స్పష్టత లభిస్తుందని ఆయనన్నారు. కొద్దిరోజుల్లో ఇండియా కూటమి సమావేశం కాబోతోందని చెప్పారు. దీంతో ప్రాథమిక స్థాయి చర్చలు ముగుస్తాయని రౌత్ అన్నారు. 'మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన, వీబీఏ పార్టీల మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయి. ఎక్కడ విభేదాలు రాలేవు. మొదట్లో కాస్త గందరగోళం ఉన్నది వాస్తవమే కానీ ప్రస్తుతం అంతా సజావుగా సాగుతోంది' అని రౌత్ తెలిపారు. మహారాష్ట్రలో శివసేన యూబీటీ 23 స్థానాల్లో పోటీ చేస్తుందని, ఎన్సీపీ 11, కాంగ్రెస్ 22 స్థానాల్లో పోటీ చేయొచ్చని తెలుస్తోంది.

ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కర్నాటక ప్రజల డబ్బు

కాంగ్రెస్ సర్కార్‌పై దేవెగౌడ ధ్వజం



బెంగళూరు : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ను ఉద్దేశించి జేడీ(ఎస్) అధినేత హెచ్‌డి దేవెగౌడ శుక్రవారం ఆరోపణలు చేశారు. కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి సహాయం చేయడానికి రాష్ట్ర 'ప్రజాధనాన్ని' ఖర్చు చేసిందని అన్నారు. ఎన్నికల్లో పోరాడేందుకు ఐదు రాష్ట్రాల్లోని కాంగ్రెస్ పార్టీకి కర్నాటక, ముఖ్యంగా బెంగళూరు నుంచి డబ్బు ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారని సిద్ధరామయ్యపై మండిపడ్డారు. గత ఏడాది సెప్టెంబరులో మాజీ ముఖ్యమంత్రి, దేవెగౌడ కుమారుడు హెచ్‌డి కుమారస్వామి న్యూదిల్లీలో హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశమైన తర్వాత జేడీ(ఎస్)... బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో చేరింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో కలిసి పోటీ చేస్తామని రెండు పార్టీలు చెబుతున్నాయి. గత ఏడాది మేలో 224 మంది సభ్యులున్న కర్నాటక అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో జేడీ(ఎస్) కేవలం 19 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. కాంగ్రెస్‌కు 135, బీజేపీకి 66 సీట్లు వచ్చాయి. కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ గురించి దేవెగౌడ ప్రస్తావిస్తూ, అతను ఎక్కడికి వెళ్లాడు. ఎంత డబ్బు రవాణా తరలించాడనేది ఇప్పుడు బహిరంగంగా ఉంది' అని అన్నారు. స్వచ్ఛమైన ప్రభుత్వాన్ని అందిస్తామంటూ సిద్ధరామయ్య చేసిన ప్రకటనపై విరుచుకుపడిన ఆయన బెంగళూరులో జరుగుతున్న అక్రమాలను ఎందుకు అరికట్టలేకపోతున్నారో చెప్పాలన్నారు. 'దయచేసి మీరు తీసుకోకపోతే, ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో ఇక్కడ నుంచి ఎంత డబ్బు తీసుకున్నారు? ఇది ఎవరి సంపద? ఇది కర్నాటక ప్రజల డబ్బు' అని దేవెగౌడ విలేకరుల సమావేశంలో అన్నారు. 'మా ఉప ముఖ్యమంత్రి (శివకుమార్), అతని దౌర్జన్యం... అతను ఎక్కడికి వెళ్లాడు, ఎంత డబ్బు రవాణా చేశాడు. ఎంత డబ్బును ఈసీ (భారత ఎన్నికల సంఘం) స్వాధీనం చేసుకుందీ ఇప్పుడు బహిరంగంగా ఉంది. బెంగళూరు నుంచి ఈ డబ్బు ఎక్కడి నుంచి వెళ్లింది?' అని ఆయన ప్రశ్నించారు. దానిని (అవినీతి) సిద్ధరామయ్య ఎందుకు ఆపలేకపోయారో చెప్పాలన్నారు.

నా భార్యను ఇన్ఫోసిస్‌లో చేరొద్దని తప్పచేశా

నారాయణమూర్తి వెల్లడి

బెంగళూరు: తన భార్య సుధామూర్తిని ఇన్ఫోసిస్‌కు దూరంగా ఉంచి తప్పు చేశానని ఆ సంస్థ అధినేత నారాయణమూర్తి చెప్పారు. నాలుగు దశాబ్దాల క్రితం నారాయణమూర్తి ... మరో ఆరుగురు సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌తో కలిసి ఇన్ఫోసిస్‌ను ప్రారంభించారు. అయితే కంపెనీలో తన భార్య సుధామూర్తిని ఎందుకు చేర్చుకోలేదో తాజాగా ఆయన బయటపెట్టారు. ఆ రోజుల్లో తాను చాలా పొరపాటుగా ఆలోచించానని నారాయణమూర్తి చెప్పారు. కంపెనీలో చేరేందుకు తమకంటే ఆమెకే ఎక్కువ అర్హతలున్నాయన్నారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నారాయణమూర్తి ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కుటుంబాన్ని కంపెనీలోకి తీసుకురాకుంటేనే మంచి కార్పొరేట్ పాలన చేయగలమని తాను భావించానని, ఆ రోజుల్లో కంపెనీలోకి వారసులు వచ్చి యాజమాన్య బాధ్యతలు చేపట్టేవారని, దీంతో చట్టాల ఉల్లంఘన ఎక్కువగా జరిగేదని తాను అనుకునేవాడినని చెప్పారు.

కానీ, కొన్నేళ్ల క్రితం కొంతమంది ఫిలాసఫీ ప్రొఫెసర్లతో మాట్లాడినప్పుడు తన ఆలోచన తప్పని అర్థమైందన్నారు. ఓ వ్యక్తికి సరైన అర్హతలున్నప్పుడు.. అది మన భార్య లేదా పిల్లలు అయినా సరే వారిని కంపెనీలోకి తీసుకోకుండా అడ్డుకునే హక్కు మనకు లేదని తెలిసొచ్చిందన్నారు. అప్పటి పరిస్థితులకు ప్రభావితమై తాను సుధామూర్తిని ఇన్ఫోసిస్‌కు దూరంగా ఉంచాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. తాను చేసింది తప్పేనని అంగీకరించారు. ఇదే ఇంటర్వ్యూలో పాల్గొన్న సుధామూర్తి ఈ వ్యాఖ్యలకు స్పందిస్తూ 'కంపెనీలో చేరొద్దని నా భర్త కోరారు. కుటుంబం మంచి కోసం నేను వెనక్కి తగ్గా. అప్పుడు దానికి నా మెదడు అంగీకరించినా... మనసు మాత్రం ఒప్పుకోలేదని తెలిపారు. వారానికి 70 పనిగంటలపై తాను చేసిన వ్యాఖ్యలను నారాయణమూర్తి మరోసారి సమర్థించుకున్నారు.

మా దోస్తీ చెక్కు చెదరదు

సిసోడియాకు కేజ్రీవాల్ జన్మదిన శుభాకాంక్షలు



న్యూదిల్లీ: ఎవరెన్ని కుట్రలు చేసినా తన మిత్రుడు, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తన స్నేహం చెక్కుచెదరదని ఆప్ అధినేత, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టంచేశారు. సిసోడియా పుట్టిన రోజు సందర్భంగా కేజ్రీవాల్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తమ ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం, విశ్వాసం చాలా బలమైందని కేజ్రీవాల్ తెలిపారు. గతంలో సిసోడియాతో కలిసి ఓ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేస్తూ కేజ్రీవాల్ స్పందించారు. 'మా స్నేహం చాలా పాతది. మా మధ్య ఉన్న అనుబంధం, విశ్వాసం చాలా బలమైంది. ప్రజల కోసం పని చేయాలనే అభిరుచి చాలా కాలంనాటిది. కుట్రదారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా... ఈ విశ్వాసం, ఆప్యాయత, స్నేహం ఎప్పటికీ చెదిరిపోదు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. సిసోడియా జైలుకు వెళ్లడాన్ని ప్రస్తావిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. బీజేపీ తప్పుడు కేసులు బనాయించి సిసోడియాను 11 నెలలుగా జైల్లోనే ఉంచిందని, కానీ, వారి అణచివేతను మనీశ్ దీటుగా ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటివరకు బీజేపీ నియంతృత్వానికి తలవంచలేదని, భవిష్యత్తులోనూ తలొగ్గరన్నారు. ఈ సమయంలో మనీశ్ చూపిస్తున్న తెగువ మనందరికీ స్ఫూర్తిగా నిలుస్తోందని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

రాజ్యసభకు స్వాతి మాలీవాల్

నామినేట్ చేసిన ఆప్

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీతో పాటు ఈశాన్య రాష్ట్రం సిక్కింలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు జనవరి 19న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు ముగ్గురు అభ్యర్థులను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నామినేట్ చేసింది. ఇందులో ఒకరు దిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మాలీవాల్. ఆమెను తమ అభ్యర్థిగా నామినేట్ చేస్తున్నట్లు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ శుక్రవారం వెల్లడించింది. దిల్లీలోని మూడు రాజ్యసభ స్థానాలకు ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సంజయ్ సింగ్, సుశీల్ కుమార్ గుప్తా, నారా యణ్ దాస్ గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారి ఆరేళ్ల పదవీకాలం ఈ నెల 27తో ముగియనుంది. దీంతో వీటికి నోటిఫికేషన్ విడుద లైంది. ఈ క్రమంలోనే సంజయ్ సింగ్, నారాయణ్ దాస్ గుప్తాను వరుసగా రెండోసారి నామినేట్ చేస్తున్నట్లు ఆప్ తెలిపింది. ఇక, సుశీల్ కుమార్ గుప్తా.. ఈ ఏడాది చివర్లో జరగబోయే హరియాణా అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించాలని నిర్ణయించుకోవడంతో ఆ స్థానంలో స్వాతి మాలీవాల్‌ను పార్టీ ఎంపిక చేసింది. ఆమెను రాజ్యసభకు నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించింది.

సంజయ్ సింగ్ నామినేషన్‌కు కోర్టు ఓకే

సంజయ్ సింగ్ మనీలాండరింగ్ కేసులో అరెస్టయి జైలులో ఉండటంతో... తాను రెండోసారి రాజ్యసభకు వెళ్లేందుకు వీలుగా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రీ నామినేషన్ పత్రాలపై సంతకం చేసేందుకు తనను అనుమతించేలా జైలు అధికారులను ఆదేశించాలని కోరారు. ఇందుకు కోర్టు అంగీకరించింది. ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ జనవరి 2వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. 9వ తేదీలోగా నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలి. ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నాయి.

దేశానికి, సీపీఐకి '2024' కీలకం

- మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దెదించడమే లక్ష్యం
- మత అజెండాతో బీజేపీ ముందుకు
- సీపీఐ విస్తృతస్థాయి సమావేశంలో రామకృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు: భారతదేశానికి, భారత కమ్యూనిస్టు పార్టీకి 2024వ సంవత్సరం ఎంతో కీలకమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీని, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు జిల్లా సమితి, నియోజకవర్గాల సమితి సభ్యులు, ప్రజాసంఘాల ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో శుక్రవారం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారం చేపట్టడానికి బీజేపీ మత అజెండాతో ముందుకు వెళుతోందని విమర్శించారు. ప్రభుత్వానికి-మతానికి, ప్రభుత్వానికి-కులానికి మధ్య ఉన్న విభజన రేఖ తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ఈ నెల 22న జరిగే అయోధ్య రామాలయ ప్రతిష్ఠామహోత్సవాన్ని విజయవంతం చేసి ఎన్నికలకు వెళ్లాలని చూస్తుందని అన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాలలో బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, 2014 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. రైతులు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని, నల్లధనం అంశాన్ని విస్మరించిందని, వాటిని చర్చకు రాకుండా దేశంలో హిందూమతం ప్రమాదంలో ఉందంటూ మతపర అజెండాను ముందుకు తీసుకువస్తోందని చెప్పారు. కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలు అవలంబిస్తోందన్నారు. సీబీఐ, ఈడీ సంస్థలతో పాటు న్యాయవ్యవస్థను సైతం బీజేపీ తన గుప్పెట్లో పెట్టుకుని, ప్రతిపక్ష పార్టీలపై ఉసిగొలుపుతోందని రామకృష్ణ విమర్శించారు. ఇటువంటి బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, ప్రజాస్వామ్యం ఉండదని, ప్రాంతీయ పార్టీల మనుగడ కష్టమేనని అన్నారు. రాష్ట్రంలో నియంత పాలన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని రామకృష్ణ అన్నారు. నాలుగున్నర సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని మండిపడ్డారు. దాదాపు రూ.10 లక్షల కోట్లు అప్పు చేశారని, ఆ అప్పుతో రాష్ట్రంలో ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ప్రాజెక్టులు కట్టారా... రోడ్లు వేశారా... ఏమి చేశారని నిలదీశారు. పైగా ఆదాయంలో తెలంగాణ కంటే వెనుకబడిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీపీఐ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనికి ప్రతి జిల్లాలో నూతన శాఖలు ఏర్పాటు కావాలని, ఆయా శాఖలలో మహిళలు, విద్యార్థి, యువజనులకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు ప్రజల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తుచేశారు. చరిత్రలో నిలిచిపోయే ఉద్యమాలు నిర్మించిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సైతం ప్రత్యేక హోదా, అమరావతి రాజధాని, అగ్రిగోల్డ్ ఉద్యమాలు కొనసాగిస్తోందని తెలిపారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను నూరుశాతం అమలు జరపడానికి చిత్తశుద్ధితో, అంకితభావంతో ముందుకు నడవాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి నిర్మాణానికి భూసమీకరణలో భాగంగా ఒక్కరూపాయి ఆశించకుండా 34 వేల ఎకరాలు భూములిచ్చిన 29 వేల మంది రైతులకు, అసైన్డ్ రైతులకు, లంకభూముల రైతులకు వార్షిక కౌలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో ఉందని, ఈ నేపథ్యంలో వారికి కౌలు చెల్లించాలని కోరుతూ సీపీఐ నాయకత్వంలో ఈ నెల 8న సీఆర్‌డీఏ కమిషనర్ కార్యాలయానికి తలపెట్టిన రాయబార యాత్రలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జంగాల అజయ్‌కుమార్ నాయకులు, కార్యకర్తల భవిష్యత్ కర్తవ్యాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కోట మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలువోలు సాంబశివరావుకు సత్కారం

గత 25 సంవత్సరాలుగా సీపీఐ గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శిగా సేవలందించిన వెలువోలు సాంబశివరావును ఘనంగా సత్కరించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు గుంటూరు జిల్లా కార్యదర్శిగా పనిచేసిన కాలంలో... జంగాల అజయ్‌కుమార్ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న కాలంలో పార్టీ కార్యాలయ కార్యదర్శిగా సాంబశివరావు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. స్నేహపూర్వక మనసత్వంతో జిల్లాలోని నాయకులు, కార్యకర్తల అభిమానాన్ని ఆయన చూరగొన్నారు. యుక్త వయస్సు నుంచి పార్టీలో, ప్రజానాట్యమండలిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భూ భాగోతం నాటికలో కరణం పాత్రధారిగా రాష్ట్రవ్యాప్తంగా ఆయన ఎనలేని గుర్తింపు పొందారు. కార్యాలయ కార్యదర్శిగా రిలీవ్ అయిన ఆయన ఇటీవల సీఆర్ ఫౌండేషన్‌లో చేరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఏపీ హవా

- అత్యుత్తమ నగరాలుగా విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వచ్ఛ సర్వేక్షణ్-2023 జాతీయస్థాయి పురస్కారాలలో వివిధ అవార్డుల కైవసం చేసుకోవటం ద్వారా ఆంధ్రప్రదేశ్ మరోసారి సత్తాచాటిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు శుక్రవారం మీడియాకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అతిపెద్ద పారిశుద్ధ్య సర్వేలో దేశంలోనే అత్యుత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నిలిచాయి. 2023 సంవత్సరానికి జాతీయ స్థాయిలో అవార్డులు దక్కించుకున్నాయి. పులివెందుల పురపాలక సంఘం రాష్ట్రస్థాయి అవార్డు పొందినట్లు గంధం చంద్రుడు తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ 2021, 2022, 2023 సంవత్సరాలలో ఇండియా క్లీనెస్ట్ సిటీ, క్లీన్ స్టేట్ క్యాపిటల్, జాతీయ అవార్డు అవార్డులు పొందిందన్నారు. విశాఖ 2021-23లో బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్, క్లీన్ బిగ్ సిటీ అవార్డులు సాధించిందని చెప్పారు. తిరుపతి నగరం బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ (2021), సఫాయి మిత్ర సురక్షిత్ ప్రెసిడెంట్ అవార్డు (2022), జాతీయ అవార్డు (2023) దక్కించుకుందన్నారు. పుంగనూరు పురపాలక సంఘం 2021, 2022 సంవత్సరాలలో బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డు, 2022లో ఇన్నోవేషన్, బెస్ట్ ప్రాక్టీస్ అవార్డును పులివెందుల పొందగా 2023లో రాష్ట్రస్థాయి పురస్కారాలు వచ్చినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు పొందేందుకు పునరంకితం అవుతామని సంకల్పించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మార్గదర్శకత, విప్లవాత్మక నిర్ణయాల వలే ఈ అవార్డులను మూడేళ్లుగా ఏపీ సొంతం చేసుకుంటోందన్నారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, పురపాలక కమిషనర్ కోటేశ్వరరావు నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వం ఈ అవార్డుల సాధనకు ఎంతగానో ఉపకరించినట్లు గంధం చంద్రుడు తెలిపారు.

అంతా క్షేమం

నౌకలో హైజాకర్లు లేరు : నేవీ

న్యూఢిల్లీ: హిందూ మహాసముద్రంలో హైజాక్‌కు గురైన నౌకలోని భారతీయులు అందరూ క్షేమంగా బయటకు వచ్చారు. ఐఎన్ఎస్ చెన్నై ద్వారా భారతీయ నౌకా దళ మార్కోస్ కమాండర్ల ఆపరేషన్ విజయవంతమైంది. నౌక డెక్‌ను శానిటైజ్ చేసిన తర్వాత 15 మంది భారతీయులతో పాటు సిబ్బందిని వారు కాపాడారు. లైబీరియా జెండాతో ఉన్న 'లిలా నార్‌ఫ్లోక్'ను ఐఎన్ఎస్ చెన్నై చేరుకొని 21 మంది క్రూ (15 మంది భారతీయులు సహా)ని కమాండర్లు రక్షించారు. నౌకలో హైజాకర్ల జాడ లేదని నేవీ ప్రకటించింది. యూకే మారీ టైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకేఎంటీఓ) అనే బ్రిటిష్ సైనిక సంస్థ ద్వారా ఈ నౌక హైజాగ్‌కు గురైనట్లు గురువారం సాయంత్రం తమకు సందేశం అందినట్లు తెలిపింది. గుర్తుతెలియని సాయుధులు నౌకలోకి చొరబడినట్లు అందులో ఉంది. వెంటనే స్పందించిన నేవీ ఈ నౌక గమనాన్ని సునిశితంగా పరిశీలించింది. సముద్ర తీర గస్తీ కోసం కేటాయించిన ఐఎన్ఎస్ చెన్నైను రంగంలోకి దించింది. దీంతోపాటు హెలికాప్టర్‌ను పంపింది. నౌకను వదిలి వెళ్లిపోవాలని హైజాకర్లను హెచ్చరించింది. నౌకలోని సిబ్బందితో సంప్రదింపులు జరిపి వారి క్షేమ సమాచారం తెలుసుకుంది. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ క్రమంలో ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలే లక్ష్యంగా దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇటీవల హిందూ మహాసముద్రంలో ఈ ఘటనలు పెరుగుతున్నాయి. కొద్దిరోజుల కిందట భారత్ వస్తున్న వాణిజ్య నౌకపై గుజరాత్ తీరంలో డ్రోన్ దాడి జరిగింది. సమాచారమందుకున్న నేవీ వెంటనే 'ఐసీజీఎస్ విక్రమ్'ను రంగంలోకి దించి సహాయక చర్యలు చేపట్టింది. ఆ నౌకలోని 20 మంది భారతీయులు సహా సిబ్బంది అంతా సురక్షితంగా బయటపడ్డారని భారత నౌకా దళం వెల్లడించింది.

ప్రభుత్వం మొద్దు నిద్రవీడి సమస్యలు పరిష్కరించాలి: ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: వైసీపీ ప్రభుత్వం మొద్దునిద్ర వీడి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించటంపై దృష్టి పెట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. శుక్రవారం అంగన్‌వాడీల సమ్మె 24వ రోజుకు చేరిన సందర్భంగా విజయవాడ ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన 24 గంటల రాష్ట్ర స్థాయి దీక్షలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మె చేపట్టి దాదాపు నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం దారుణమన్నారు. కనీస వేతనం, గ్రాట్యూటీ ప్రకటించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సంక్రాంతి తరువాత ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. తరువాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దీక్షలను ప్రారంభించిన ఆల్ ఇండియా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్.సింధు మాట్లాడుతూ అంగన్‌వాడీల సంక్షేమం కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్రంలోని మోదీ, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేయడం లేదని, ఇది కోర్టు ధిక్కరణే అవుతుందని తెలిపారు. అంగన్‌వాడీల సమ్మె విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులు, దాడులు, కేసులు వంటి వాటిని మానుకొని, తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమానికి దేశ వ్యాప్తంగా తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులుగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఉన్నారని తెలిపారు.

పౌష్టికాహార లోపంతో ప్రతి రోజు 29 వేల మంది పిల్లలు మృత్యువాత పడుతున్నారని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), (సీఐటీయూ), ఐఎఫ్‌టీయూ యూనియన్లకు చెందిన ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నాయకులు, కార్యకర్తలు ఈ దీక్షలో కూర్చున్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలు తప్పక విజయం సాధిస్తారని అన్నారు. గ్రామాల్లో సదరు లబ్ధిదారులకు ఐద్వా, ఇతర సంఘాల ద్వారా అవగాహన కల్పించి, అంగన్‌వాడీ ఉద్యమానికి తోడుగా ఉండటానికి బాధ్యత తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అంగన్‌వాడీల ఉద్యమానికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన సమ్మెకు పీడీఎఫ్ ఎమ్మెల్సీల తరపున మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఐఎఫ్‌టీయూ నాయకులు ఎ.రవిచంద్ర మాట్లాడారు. ఈ దీక్షలో అంగన్‌వాడీల యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, ప్రేమ, లారెన్స్ క్రిస్టియానమ్మ, అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తదితరులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ సుప్రజ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తెలుగుభాషను బతికించాలి

అంతర్జాతీయ తెలుగు మహాసభలో వక్తల ఉద్ఘాటన

విశాలాంధ్ర-రాజానగరం: సాంస్కృతిక, సాహిత్యాలకు రాజమహేంద్రవరం పుట్టినిల్లు వంటిదని ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. శ్రీశ్రీ రాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, నన్నయ భారతాంధ్రీకరణకు వెయ్యేళ్ల సందర్భంగా తూర్పుగోదావరి జిల్లాలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త అధ్వర్యంలో మూడు రోజులు పాటు జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలను ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్, విశిష్ట అతిథిగా విచ్చేసిన విశాఖ శారదా పీఠం అధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రస్వామి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు గీతా బోధన చేసిన మహాభారతాన్ని ఆదికవి నన్నయ తెలుగులో అనువదించి వెయ్యేళ్లు పూర్తి కావడం, రాజరాజనరేంద్రుని సహస్రాబ్ది ఉత్సవాలు నడుమ గోదావరి తీరాన తెలుగు మహాసభలు నిర్వహించడం హర్షణీయమన్నారు. సాంస్కృతిక, సాహిత్యాల కేంద్రంగా విరాజిల్లుతున్న రాజమహేంద్రవరమన్నా, గోదావరి ప్రాంతమన్నా తనకెంతో ఇష్టమన్నారు. స్వరూపానందేంద్రస్వామి మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వవైభవం రావాలన్నారు. విశ్వంలో ఎన్నో భాషలున్నప్పటికీ తెలుగు భాషకు ఉన్న గొప్పతనం, మాధుర్యం మరో భాషకు లేదని, అటువంటి తెలుగు భాషను కాపాడుకోవాలన్నారు. తెలుగులో గర్వించదగ్గ కవులు, కావ్యాలు, పురాణ ఇతిహాస అనువాదాలు ఉన్నాయన్నారు. తెలుగుభాష మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ చదువు కన్నా సంస్కారం ముఖ్యమని, తెలుగు భాష నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. యువతలో భాషమీద అభిమానం కలగాలన్నారు. తెలుగులోనే మాట్లాడటం, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవడం జరిగితే తెలుగు భాషకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. పద్మవిభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్, తెలుగు నిఘంటువు రూపొందించిన సీపీ బ్రౌన్, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం ప్రాతఃస్మరణీయులన్నారు. తెలుగు వారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన నందమూరి తారక రామారావు, రాజ్యసభలో ఎవరి మాతృభాషలో వారు మాట్లాడే వీలు కల్పించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులను గుర్తు పెట్టుకోవాలన్నారు. చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేవీవీ చైతన్య రాజు మాట్లాడుతూ మహాసభల నిర్వహణతో సరి పెట్టకుండా తెలుగు భాష ఉన్నతికి తమ కుటుంబం ఒక ట్రస్ట్ ఏర్పాటు చేయాలని భావిస్తోందన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ స్వాగతం పలుకుతూ తెలుగు భాషలోని మాధుర్యాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ప్రతిభ బంగారు పళ్లెం కాదని, సూర్యబింబం వంటిందని, ఇది సహజంగానే కాంతి వెదజల్లుతోందని అష్ట, శత, ద్విశతక అవధాని పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. తెలుగు పద్యానికి అంతం లేదని, యువత తెలుగులో ప్రవచనాలు చెప్పాలని, కావ్యాలు సైతం రచించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యదర్శి రామ్‌మాధవ్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, ప్రముఖ సినీ రచయిత విజయేంద్రప్రసాద్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే బందారు సత్యానందరావు, మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు, కవి అందెశ్రీ, జేఎన్‌టీయూ వీసీ ప్రసాదరావు, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, భువన విజయం, మయసభ సీన్ ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్సీ కె.రవివర్మ, గైట్ కళాశాల ఉపాధ్యక్షుడు శశివర్మ, మంతెన కేశవరాజు, బైర్రాజు ప్రసాదరాజు, సత్య నారాయణరాజు మాస్టారు, పీఎస్ రాజు, వర్మ, వేటుకూరి సూర్యనారాయణరాజు, నీరుకొండ వీరన్న చౌదరి, నడింపల్లి సీతారామరాజు, తెలుగు మహాసభల సమన్వయకర్త సునంద రమేశ్, సలహా మండలి సభ్యులు టీవీఎస్ సాయిబాబా, సుమేధ రాజు, ఫ్యూచర్ కిడ్స్ రవి, అపుస్మ అధ్యక్షుడు సుంకవల్లి మురళి, ఆకుల ప్రకాశ్, ఆంధ్రసారస్వత పరిషత్ ముఖ్య సలహాదారులు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, ధవేజీ, కోట్ల కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రాంభట్ల

పుస్తక మహోత్సవంలో కల్లూరి భాస్కరం

విశాలాంధ్ర-విజయవాడ: భారతీయ తత్వ శాస్త్రాలు, వేదాలు, పురాణాల చరిత్ర, గడచిన చరిత్ర, సాహిత్యం తదితర అంశాలను ప్రపంచం లోని ఇతర వాఙ్మయాలను శాస్త్రీయంగా పోల్చి, సమన్వయం చేయటం, తద్వారా పాశ్చాత్య సంస్కృతిని మన దేశ సంస్కృతితో తూకం వేయడం రాంభట్ల కృష్ణమూర్తి ప్రత్యేకత అని ప్రముఖ పాత్రికేయులు, రచయిత కల్లూరి భాస్కరం అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవం తొమ్మిదోరోజు శుక్రవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు టి.మనోహర్ నాయుడు అధ్యక్షతన రాంభట్ల కృష్ణమూర్తి శతజయంతి సభ జరిగింది. కల్లూరి భాస్కరం మాట్లాడుతూ రాంభట్లను బడిచదువులు లేని బహుముఖ ప్రజ్ఞాశాలిగా అభివర్ణించారు. సంక్లిష్టమైన విషయాలను సరళంగా, అర్థమయ్యేలా వివరించడం ఆయన ప్రత్యేకత అన్నారు. మనదేశంలో మతం జ్ఞానానికి అడ్డంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాంభట్ల కృష్ణమూర్తి రచనలు అందరూ చదవాలన్నారు. ఆర్యావర్తం అనేది భారత భౌగోళిక భూభాగానికి పరిమితమైంది కాదని రాంభట్ల నిరూపించాడన్నారు. భారతీయ నాగరిత ప్రస్తుతం బైకాల్ అని పిలువబడుతున్న వైఖానస సరస్సు ఒడ్డున ప్రారంభమయిందని రాంభట్ల ప్రతిపాదించినట్లు చెప్పారు. మన రామాయణ, భారతాలు మనదేశానికి పరిమితమైన కథలు కావని రాంభట్ల అనేక శాస్త్రీయ ప్రతిపాదనలు చేశారన్నారు. రాంభట్ల కృష్ణమూర్తి శాస్త్రీయమైన ఆలోచనలను తమ పరిశోధనల ద్వారా మరింత ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత పండితలోకానికి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రముఖ పాత్రికేయులు తాడి ప్రకాశ్ మాట్లాడుతూ రాంభట్ల తెలుగు సరళంగా, సుబోధకంగా ఉంటుందన్నారు. జ్ఞానవృద్ధుడైన రాంభట్ల తనకన్నా చిన్నవయసువాళ్లతో చాలాస్నేహంగా, ఆత్మీయంగా ఉండేవారన్నారు. నడిచే విజ్ఞాన సరస్వంగా భాసిల్లిన రాంభట్ల సాహిత్యకృషి గురించి పూర్తిస్థాయి పరిశోధనలు జరగాలన్నారు. కీర్తి ప్రతిష్ఠలు, ప్రతిఫలాలు ఆశించకుండా కేవలం తనకు నచ్చిన పని చిత్తశుద్ధితో చేసుకువెళ్లిన తరానికి రాంభట్ల ప్రతినిధి అన్నారు. టీడీపీ నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ ఆశయం, కృషి ఉంటే చదువుతో సంబంధం లేకుండా ఉన్నత విజయాలు సాధించడం సాధ్యమేనని రాంభట్ల నిరూపించాడన్నారు. అరసం వారు ప్రచురించి 'రాంభట్ల స్మృతి' సంచికను వేదికపై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య, మాజీ అధ్యక్షులు బెల్లం బాబ్జీ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

భూ హక్కుల యాజమాన్య చట్టం రద్దు

చైతన్య వేదిక డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజ మాన్య చట్టం-2023ను తక్షణమే రద్దు చేయాలని సామాజిక, రాజకీయ విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. స్థిరాస్తి చట్టాన్ని రక్షించు కోవాలని, ఇందుకోసం భూ హక్కు ఉన్నవారు కాకుండా ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ఆమోదించిన భూమి హక్కుల యాజమాన్య చట్టం ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారే అవకాశాలు లేకపోలేదని హెచ్చరించారు. దీనిపై వ్యాజ్యాలను ఉన్నత న్యాయ స్థానాలు నిర్లక్ష్యం చేయరాదని, ఇంకా నిబంధనలు రాలేదని, అధికారుల నియామకం జరగలేదంటూ తోసిపుచ్చవద్దని కోరారు. ప్రజల పక్షాన నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ చట్టం అమలులోకి వస్తే సన్న, చిన్న కారు, మధ్య తరగతి రైతులు నష్టపోతారని లక్ష్మీనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక శ్రీకాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం ఏలూరు చైతన్య వేదిక అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టం పూర్వాపరాలు -పరిణామాలపై సదస్సు జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా చట్టం చేసి పెత్తందారులకు కొమ్ము కాస్తుందని లక్ష్మీనారాయణ విమర్శించారు. అనంతరం పి.రతన్ రాజు మాట్లాడుతూ ఏపీ భూమి హక్కుల యాజమాన్యం చట్టాన్ని న్యాయ వ్యవస్థ పట్టించుకోక పోవడం దురదృష్ట కరమన్నారు. రెవెన్యూ శాఖ ఈ చట్టాన్ని అమలు చేస్తే అవినీతి పెరుగుతుందని అన్నారు. ఈ చట్టం రాజ్యాంగవిరుద్ధమైనదని, దీనిని వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రతన్ రాజు హెచ్చరించారు. చైతన్య వేదిక అధ్యక్షుడు పీఎస్ చందు అధ్యక్షతన జరిగిన సదస్సులో చైతన్య వేదిక కార్యదర్శి రెడ్డి శ్రీనివాస డాంగే, కమిటీ సభ్యులు పీపీ శాస్త్రి, వాకాడ రాజారావు, బీవీఎస్ రావు, కేజే సత్యనారాయణ సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాబు ఏం చేశావని కదలి రావాలి : పేర్ని నాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఎవరికి ఏం చేశారని కదలి రావాలని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) ప్రశ్నించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు 'కదలిరా'పై విమర్శలు చేశారు. చంద్రబాబుకు ప్రజలను దూషించడమే పనన్నారు. 14 ఏళ్ల పాలనలో ఆయన చేసదినదేమిటి? గ్రామంలో ఒక్క కార్యాలయమైనా కట్టారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఈ రాష్ట్రానికిగానీ, ప్రజలకుగానీ చేసినదేమీ లేదని, అధికారం పోయినప్పుడు అవి చేస్తాం.. ఇవి చేస్తామని చెప్పడం ఆనవాయితీ అని పేర్ని నాని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన హయాంలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో చెప్పాలన్నారు. ఖర్చులు తగ్గించి, ఆదాయాన్ని పెంచారా? అని నిలదీశారు. చంద్రబాబువి దగా మాటలని, అధికారంలోకి వస్తే పేదలకు తక్కువ ధరకే మద్యం సరఫరా చేస్తానన్నారని, సరసమైన ధరలకే మద్యం ఇస్తామని ఏ నాయకుడైనా హామీ ఇస్తారా? అని పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్రాంతికి 6,795 ప్రత్యేక బస్సులు

నేటి నుంచే రాకపోకలు

సాధారణ చార్జీలతోనే ప్రయాణం: ఏపీఎస్ఆర్టీసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్రాంతికి 6,795 ప్రత్యేక బస్సులను ఏపీఎస్ఆర్టీసీ నడపనుంది. పండుగ కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతోనే నడపనున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. సంక్రాంతికి ముందు, తర్వాత రోజుల్లో నడిచే ప్రత్యేక బస్సుల వివరాలను తెలిపారు. సంక్రాంతికి ముందురోజు 3,570 ప్రత్యేక బస్సులు నడుస్తాయని, వీటిలో హైదరాబాద్ నుంచి 1,600, బెంగుళూరు నుంచి 250, చెన్నై నుంచి 40, విజయవాడ నుంచి 300, విశాఖపట్నం నుంచి 290, రాజమండ్రి 230, తిరుపతి 70తో పాటు ఇతర ముఖ్య ప్రాంతాల నుంచి 790 బస్సులు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. సంక్రాంతి తర్వాత రోజు 3,225 ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. ఈనెల 6-14 తేదీల్లో (పండుగకు ముందు), 16-18 తేదీల్లో (పండుగ తర్వాత) ప్రత్యేక బస్సులు రాకపోకలు సాగిస్తాయని, సాధారణ సర్వీసులతో పాటు ప్రత్యేక సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ల సౌకర్యాన్ని కల్పించామని ఆయన చెప్పారు. రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు తిరుమలరావు వెల్లడించారు. ప్రత్యేక సర్వీసుల పర్యవేక్షణకుగాను అన్ని జిల్లా కేంద్రాలు, హైదరాబాద్‌తోపాటు వివిధ పాయింట్ల వద్ద అధికారులు, సూపర్ వైజర్లు, భద్రతా సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. బస్సుల సమాచారం, సమస్యల కోసం 149ని, 0866 257005 కాల్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగించుకోవాలని, సురక్షిత-సౌకర్య ప్రయాణ అనుభూతిని పొందాలని తిరుమలరావు అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.